J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 6 15.7.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఇదీ వైసిపి ప్లీనరీ ముఖచిత్రం

# జగన్ - జనం - జపం



- రెండు రోజుల సభలలోనూ 'జగన్నామ'స్మరణం
- 'జై జగన్' అంటూ లక్షల సంఖ్యలో తరలివచ్చిన జనం
- జై... జై నాయకా అంటూ జపం చేసిన నాయక గణం

వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ తరువాత జరిగిన తొలి ప్లీనరీ పార్టీశ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అరాకొరా నిరుత్సాహంతో ఉన్న ద్వితీయశ్రేణి నాయకులలో కొత్త జవసత్వాలు కలిగించి ఉత్తేజపరచింది. దివంగత మహానేత ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి 73వ జయంతి సందర్భంగా జరిగిన ఈ ప్లీనరీ విభజనాంధ్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులలో కోటి ఆశలు చిగురింపజేసింది. తమ నాయకుడు కోరు కున్నట్లుగా 175కి 175 సీట్లు అందించేలా ప్రేరణ కల్పించింది.

10లో

## అధ్యక్ష భవనం వదిలి

# గోడ బయటకు.. గొటబాయ



### తిరగబడిన లంక వాసులు

### అధ్యక్ష భవనంలోకి చొరబాటు

### ఈ పరిణామం దేనికి సంకేతం?

పాలకులు ఎంత బలవంతులైనా నిరంకుశులైనా ప్రజాగ్రహం ముందు నిలువలేరన్నది చరిత్ర చెప్పిన సత్యం. ప్రజలు తలచుకుంటే ఎంతటి నాయకుడైనా పరార్ కావడం తప్పదు. ప్రజాసంక్షేమాన్ని, ప్రజల భద్రతను పట్టించుకోని పాలకులపై ప్రజల నిరసన జ్వాలలు ఎగసిపడితే అధికార సౌధాలు పునాదులతో సహా కాలిపోయి కూలి పోతాయని శ్రీలంకలో తాజాగా వెల్లువెత్తిన ప్రజా ఉద్యమం మరోసారి రుజువు చేసింది. మితిమీరిన అవినీతి, అసమర్థపాలన, అధికార దురహంకారం.. పరాకాష్టకు చేరిన అధికార దుర్వినియోగం ఫలి తంగా శ్రీలంకలో సంక్షోభం తలెత్తింది. ధరలు భారీగా పెరగడం, పేదరికం ప్రబలడంతో చివరికి ఆకలికి తట్టుకోలేక ప్రజలు ఒక్కసారిగా కదలికెరటాల్లా హోరెత్తుతూ వచ్చి నేతలను తారెత్తించారు. దీంతో దేశాధ్యక్షుడు, ప్రధాని సైతం బిత్తరపోయారు. అధ్యక్షుడు గోడదూకి పరారయ్యాడు. పెద్దఎత్తున అధ్యక్ష భవనంలోకి జనం చొరబాటు జరిగింది. శ్రీలంక ప్రజల తిరుగుబాటుకు అది నిదర్శనంగా నిలిచింది.

కడుపు మండిన ప్రజల ఆగ్రహజ్వాల ఎంత తీవ్రంగా ఉంటుందో ఇటీవల శ్రీలంక రాజధాని కొలంబో ప్రత్యక్షంగా చవిచూసింది. భయంకరమైన ఆర్థికసంక్షోభంతో దేశాన్ని అస్తవ్యస్తంగా అల్లకల్లోలంగా మార్చిన నేతల తీరుపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దేశాన్ని దివాళా తీయించిన నేతలపై శ్రీలంక ప్రజలు

10లో

## ప్రథమ వర్ధంతి

16-07-2022




కీ॥శే॥ Dr. P.L. రావు గారు

Founder: Modern Group of Eye Hospitals

అద్వితీయ వైద్యం, అపురూప స్నేహం, ఆనంద వదనం, ఆదరించే నైజం గుర్తులుగా అనుక్షణం మమ్మల్ని నడిపించారు

గడచిన ఈ సంవత్సరం. మాడరన్ గ్రూప్ ఆఫ్ 'ఐ' హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మా ఇంటి దైవమైన

కీ॥శే॥ Dr. P.L. రావు గారి

ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు సంపూర్ణ స్వర్గ ప్రాప్తి కలగాలని, మమ్ములను ఎల్లప్పుడూ కాపాడాలని భగవంతుని ప్రార్థిస్తూ...

ధర్మపత్ని : Dr. H. భారతి
Chairperson, Modern Group of Eye Hospitals

కుమార్తె : Dr. P. చిన్మయి
Aravind Eye Hospital, Madurai

మనుమరాలు : G. వైష్ణవి

అల్లుడు: Dr. G. విష్ణు తేజ
Aravind Eye Hospital, Madurai

BR

MODERN GROUP OF EYE HOSPITALS
NELLORE | CHITTOOR | KURNOOL | VIJAYAWADA | GUNTUR | ONGOLE

# డాక్టర్ పెళ్ళకూరు జయప్రదకు.. సన్మానం



అక్షరయాన్ తెలుగు ఉమెన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని ప్రముఖ నవలా రచయిత్రి డా. పెళ్ళకూరు జయప్రదను ఘనంగా సన్మానించారు. స్థానిక విజయమహల్ గేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అక్షరయాన్ జిల్లా శాఖ ప్రతినిధి గోవిందరాజుల సుభద్రాదేవి మాట్లాడుతూ డా. జయప్రద రచనల విశిష్టతను తెలియజేశారు. ప్రముఖ సాహితీవేత్త అయినంపూడి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లోని వందలాదిమంది రచయిత్రులతో అక్షరయాన్ అనేక సారస్వత కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా షష్టిపూర్తి కలాలకు 'మాతృవందనం' చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రచయిత్రులు ములుగు లక్ష్మి, డా.సుహాసిని, తోట సులోచన, బొగ్గవరపు ఇందిర, ప్రసన్న లక్ష్మి, సందడి అరుణ, అనూరాధ, అనూరాధ, సయ్యద్ నజ్మా, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగుల.. కొత్త కార్యవర్గం



జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘానికి ఇటీవల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు నగరంలోని దొడ్ల పద్మావతమ్మ మహిళా గ్రంథాలయంలో ఈ ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షునిగా ఎన్.రవీంద్రరావు, అధ్యక్షునిగా ఐ.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పెంచలయ్య, ఉపాధ్యక్షులుగా వి.సుధాకర ఆచారి, ఎం.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా ఏ.గోవిందరెడ్డి, డి.జయమ్మ, కోశాధికారిగా ఇ.ఏడుకొండలు, రాష్ట్ర ప్రతినిధిగా వి.రంగారెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జి.డి శంకరయ్య, ఎం. నరసింహరాజు, జెవిఎస్ శాస్త్రి, పి.ఆదిలక్ష్మి, కె. మునిరామిరెడ్డి, ఎన్.రామారావు, జి. వెంకయ్యలను ఎన్నుకున్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థల పింఛనర్ల సంఘం అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు సమక్షంలో ఏకగ్రీవంగా ఈ ఎన్నిక జరిగింది.

# ధర్మరాజస్వామి దేవాలయంలో.. బ్రహ్మోత్సవాలు ప్రారంభం

## 21రోజుల పాటు 'మహాభారతం'ను తలపించే వేడుకలు



నెల్లూరు మూలాపేటలో వెలసి వున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవాలయంలో ఈ నెల 13 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంతో పురాతనమైన ఈ దేవాలయంలో శ్రీ కృష్ణుడు, ధర్మరాజు, ద్రౌపది దేవి అమ్మవారు కొలువై ఉంటారు. అగ్నికుల క్షత్రియులకు కులదేవతగా అమ్మవారుగా ఎంతోకాలంగా ఇక్కడ పూజలందుకుంటున్నారు. మూడేళ్లకోసారి బ్రహ్మోత్సవాలు ఇక్కడ బ్రహ్మాండంగా జరుగుతాయి. మహాభారతంలోని ఘట్టాలను తలపించేవిధంగా ఎంతో సంబరంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఈనెల 13 నుంచి ఆగస్టు 2వ తేది వరకు 21 రోజుల పాటు పెద్దఎత్తున జరిగే ఈ ఉత్సవాలకు వేలసంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఆర్జీఓ పి.కొండయ్య, ఆలయ ఛైర్మెన్ రామకృష్ణ, ఇఓ డి. వెంకటేశ్వర్లు సారథ్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.

### అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు :

ఈనెల 13వ తేది రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. 14వ తేది గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 15వ తేది రాత్రి పాండవజననం అలంకారం, 16న అక్షరాభ్యాసం, విలువిద్య అలంకారాలు, 17న లక్కగృహ దహనం, 18న హిడింబాసుర వధ, 19న ద్రౌపదీ కల్యాణం, 20న సుభద్రా కల్యాణం, 21వ తేది రాత్రి రాజసూయ యాగం ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. అదేవిధంగా 22వ తేది రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ అలంకారం, 23న తపస్సుమాను ఉత్సవం, 24న విరాటపర్వం అలంకారం, 25న మల్లయుద్ధం అలంకారం, 26న కీచకవధ అలంకారం, 27న ఉత్తర గోగ్రహణం, 28న శ్రీకృష్ణ రాయబారం, 29న అలుగు నిలుపుట (ఐలవతుని వధ, కాళికాదేవి పూజ), 30న దుర్యోధన, దుశ్శాసన వధ వేడుకలు ఉంటాయి. 31న అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు మరింత పెద్దసంఖ్యలో పాల్గొంటారు. ఆగస్టు1న వసంతోత్సవం, 2వ తేది మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి యుధిష్టర పట్టాభిషేకం (దర్బార్ అలంకారం)తో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

# రంగనాథస్వామికి గరుడసేవ



స్వాతి నక్షత్రం, పెరియాళ్వార్ల వర్ష తిరునక్షత్రాలను పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారికి గరుడసేవ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. పెరియాళ్వార్లకు గజవాహనోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యుల నేతృత్వంలో ఈ పూజలు, సేవలు జరిగాయి. ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శివకుమార్ ఆచారి తదితరులు పర్యవేక్షించారు.

## కావలిలో డాక్టర్ జివికె ట్రస్ట్

# ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని డాక్టర్ జి.విజయ కుమార్ మెమోరియల్ ట్రస్ట్ వారు ఈనెల 10న కావలిలోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించి సుమారు 150 మందికి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. కేవలం రెండువందల రూపాయలకే రెండు నెలలకు అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్‌రెడ్డి, నర్సులు రాజేశ్వరి, పావని, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# సిఐలకు బదిలీలు

జిల్లాలో పలువురు సిఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ ఈనెల 11న ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణను రేంజ్ కార్యాలయానికి బదిలీచేసి ఆ స్థానంలో నెల్లూరులో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎం. మధుబాబును నియమించారు. అదేవిధంగా నెల్లూరు నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రాములునాయక్‌ను రేంజ్ కార్యాలయానికి పంపి, ఆయన స్థానంలో గూడూరు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరమ్మను నియమించారు. రేంజ్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.సురేంద్రబాబును నెల్లూరులోని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

# రేషన్ డీలర్ల నిరసన

దేశంలో 'ఒకే నేషన్-ఒకే రేషన్' విధానంతో పాటు ఒకే రేషన్-ఒకే కమీషన్ కూడా ఉండాలంటూ జిల్లా రేషన్ డీలర్ల దుకాణాదారుల సంక్షేమసంఘం వారు ఈనెల 11న నెల్లూరు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ ఆందోళనలో సంఘం నాయకులు సుదర్శన రమేష్, జివి కృష్ణారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, ఎస్‌కె అల్లాభక్ష, ఎన్.రవి, ఎంవి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కోనలో మహావిష్ణు అవతారంలో పెంచలస్వామి



వేదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

# వేడుకగా.. తొలి ఏకాదశి

ఈనెల 10న తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆలయాలకు తరలివెళ్లి పూజలు చేసుకుని వేడుకగా పండుగ జరుపుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో ఈ పండుగ రోజున స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. నెల్లూరులోని ప్రసిద్ధమైన శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఉదయం తిరుమంజనం, రాత్రికి గరుడసేవ కన్నులపండువగా నిర్వహించారు. మూలస్థానేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేపట్టారు. పెంచలకోనలో స్వామివారు మహావిష్ణు అలంకారంలో కొలువుదీరారు. నరసింహ కొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు.

# రైతులకు అండగా ప్రభుత్వం

## రైతు దినోత్సవంలో కలెక్టర్ చక్రధర్‌బాబు



రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటోందని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి గ్రామ స్థాయిలోనే రైతులకు అవసరమైన సలహాలు సూచనలతో పాటు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులను సబ్సిడీపై అందచేసే వినూత్నమైన వ్యవస్థను తీసుకు రావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు చెప్పారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ఇటీవల ఏర్పాటుచేసిన రైతు దినోత్సవ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత స్వర్గీయ డా. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, డా. వై.ఎస్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎన్నో ఏళ్ల నుండి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టి సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత సాగు పద్ధతుల మార్పులు, రైతులు అనుసరించాల్సిన విధానాలపై రైతు సంఘాల ప్రతినిధులు కోటి రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు, కృషి విజ్ఞానకేంద్రం అధిపతి డా. సుమతి తదితరులు ప్రసంగించారు. తొలుత రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ, ఉద్యాన శాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారావు, ఏ.పి.ఎం.ఐ.పి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డా. యు.వినీత పాల్గొన్నారు.

# అంగరంగ వైభవం.. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం



నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో వెలసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న స్వామివారికి నిర్వహించిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కనుపర్తిపాడు నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి, తమిళనాడు తదితర దూరప్రాంతాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి పూలమాలలతో కనువిందుగా అలంకరించిన రథంపై వేంచేపు చేశారు. భక్తులు రథాన్ని ముందుకు లాగుతూ స్వామివారిని ఊరేగించారు. తుమ్మగుంట రమణయ్య-విమలమ్మ, శ్రీకాంత్-కీర్తి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కందాళ శ్రావణకృష్ణ, అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు.

# నరేంద్ర మోడీకి నారా బాబు గాలం!
# పట్టుకున్నాడు రాష్ట్రపతి ఎన్నికల వాలం!!



## అడగకుండానే ముర్ముకి మద్దతు

రాష్ట్రపతి ఎన్నికను ఆసరాగా చేసుకుని, నరేంద్రమోడీకి తిరిగి దగ్గరయ్యేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాస్టర్‌ప్లాన్ వేశారు. రాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ము విజయవాడ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఆమెకి అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. క్యాంపు ఆఫీస్‌లో తేనీటి విందు ఇచ్చారు. దుర్గ గుడి నుండి అయ్యవార్లను రప్పించి ప్రత్యేకంగా ఆశీస్సులు ఇప్పించారు. ముఖ్యంగా తన పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి, వారికి ఆమెను పరిచయం చేసి, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ఆమెకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఇదే తరుణంలో తాము కూడా ద్రౌపది ముర్ముకే మద్దతు ఇస్తున్నామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. లోక్‌సభలో ముగ్గురు, రాజ్యసభలో ఒక్కరు టీడీపీకి ఉన్నారు. అసెంబ్లీలో 23 మంది ఉన్నారు. తమ పార్టీ తరఫున కూడా ఓ సమావేశం పెట్టుకుంటామని, ముర్ము ఆ సమావేశానికి వస్తే, అక్కడ మా మద్దతును ప్రకటిస్తామని బీజేపీకి బాబు వర్తమానం పంపారు. ఆ ప్రతిపాదనను హోంమంత్రి వెంటనే అంగీకరించారు. అడగకుండానే ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన చంద్రబాబునాయుడును బీజేపీ నేతలు వేనోళ్ల పొగిడారు. 2019లో అధికారం కోల్పోయిన తరువాత, బీజేపీ నేతలు చంద్రబాబు పక్కన కూర్చోవడం గానీ, ఆయనను పొగడడం కానీ ఇదే మొదటిసారి.

ఇది ఇక్కడితో ఆగుతుందా... లేక ముందు ముందు కూడా కొనసాగుతుందా అనేది ఇప్పటికి సస్పెన్స్. మొత్తానికి బాబు రాష్ట్రపతి ఎన్నికల వాలం పట్టుకుని మోడీ బృందానికి గాలం వేశాడన్నది ఇప్పుడు పొలిటికల్ టాక్.



# డాక్టర్ ప్రేమ్‌రెడ్డికి 'ఆటా జీవిత సాఫల్య పురస్కారం'

అమెరికా వై.యస్.ఆర్‌గా అక్కడి తెలుగువారు ఆప్యాయంగా పిలుచుకునే డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డిని 'అమెరికా తెలుగు అసోసియేషన్' (ఆటా) 'జీవిత సాఫల్య పురస్కారం'తో సత్కరించింది. జులై 1 నుండి 3వతేదీ వరకు అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో మూడురోజుల పాటు జరిగిన ఆటా 17వ ద్వైవార్షిక సభలలో కొన్ని వేలమంది తెలుగువారి కరతాళధ్వనుల మధ్య ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సేవా రంగాలతో పాటు వైద్య రంగంలో సైతం ఆయన అందిస్తున్న సేవలకు గుర్తుగా ఆయనను జీవిత సాఫల్య పురస్కారంతో గౌరవించింది ఆటా.

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని ఒక చిన్న గ్రామం నిడిగుంటపాళెంలో జన్మించారు ననమాల ప్రేమ్‌సాగర్‌రెడ్డి. వైద్య రంగంలో పట్టభద్రుడై ఖండాంతరాలు దాటి అమెరికా దేశంలో స్థిరపడి అక్కడ సంచలనాలను సృష్టిస్తున్న మన నెల్లూరు రైతుబిడ్డ ప్రేమ్‌రెడ్డి. మన తెలుగువారికి, మరీ ముఖ్యంగా నెల్లూరీయులకు ఎక్కడ ఏ అవసరమున్నా అక్కడ నేనున్నా... అంటూ స్పందించే సహృదయశీలి ఆయన. అమెరికాలో అందరూ 'ప్రేమన్నా' అని పిలుచుకునే ఆత్మీయమూర్తి, అనురాగదీప్తి డాక్టర్ ప్రేమ్‌రెడ్డి. తన


ప్రేమ్‌సాగర్‌రెడ్డిని అభినందిస్తున్న 'నాటా' అధ్యక్షుడు కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి

సేవా గుబాళింపులతో ఇప్పటికే ఎన్నో అవార్డులను, ప్రశంసలను అందుకున్న ప్రేమ్‌రెడ్డికి ఆటా 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' సత్కారం అందుకున్న సందర్భంలో అభినందనలు తెలుపుతోంది 'లాయర్'.

# శ్రీసిటీలో.. పరిశ్రమల ప్రతినిధుల సమావేశం



తిరుపతి జిల్లాను ఎగుమతి కేంద్రంగా రూపొందించాలనే లక్ష్యంతో ఈనెల 13న శ్రీసిటీలో ఎగుమతి తయారీ పరిశ్రమల ప్రతినిధుల సమావేశం జరిగింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానానికి అనుగుణంగా రాష్ట్రాన్ని ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా, ఎగుమతి ఆధారితంగా మార్చాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వ వర్గాల అభిప్రాయాలను సేకరించేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వైజాగ్‌లోని ఫారిన్‌ట్రేడ్ జాయింట్ డైరెక్టర్ జనరల్ డా.ఎన్.రమేష్, న్యూఢిల్లీలోని హస్తకళల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ డైరెక్టర్ రాజేష్ సింగ్‌లు వర్చువల్ విధానం ద్వారా ఈ సమావేశంలో ప్రసంగించారు. తిరుపతి జిల్లాను ఎగుమతి హబ్‌గా రూపొందించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని వారు సూచించారు. వివిధ రంగాల్లో ఎగుమతి తయారీదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా అభిప్రాయలు తెలియజేయాలని కోరారు. ఎగుమతి పరిశ్రమలకు అన్నివిధాల మద్దతునిచ్చి శిక్షణ, మార్గదర్శకం కల్పిస్తామని, తిరుపతి జిల్లాలో కలంకారి కళాఖండాలు, హస్తకళా ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి తగు సూచనలు చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా నుంచి అనేకమంది ప్రతినిధులు పాల్గొన్నారు.




లాయర్ జులై 15, 2022

# సవాల్‌గా మారనున్న అధిక జనాభా

ప్రపంచ జనాభాలో వచ్చే ఏడాదికల్లా చైనాను అధిగమించి మనదేశమే అగ్ర స్థానంలో ఉండబోతోందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. భూగోళంలో జన విస్ఫోటనం పెరిగిపోతోందని, జనమే మన ధరిత్రిని కాపాడుకోవాలని హెచ్చరించింది. ఎక్కడైనా సరే, అధిక జనాభా అనర్థదాయకం. నానాటికీ పెరిగిపోతున్న జనాభా మనదేశానికి సవాల్ కాకముందే మేలుకోవాలి. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా జనాభా నియంత్రణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలి. జనం పెరిగినా, దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యలు లేని దేశంగా మన దేశాన్ని తీర్చిదిద్దుకోవాలి. భవిష్యత్ భారతావనిని అందంగా రూపుదిద్దుకోవాలి.

ఈ భూమి మీద జీవరాశులు పుట్టకముందు అంతా జలమయంగా ఉండేదని అంటుంటారు. ఆరోజులు మారిపోయాయి. ఇంకొన్నేళ్లు గడిస్తే భూగోళం కాస్తా 'జన'మయంగా ఉండబోతోందని అంటున్నారు. నానాటికీ పెరిగిపోతున్న ప్రపంచ జనాభాను చూస్తుంటే ఇక కొద్ది కాలంలోనే ధరిత్రి నిండా జనమే నిండిపోవచ్చని ఊహించుకోవచ్చు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జులై 11న ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రపంచ జనాభా విస్ఫోటనాన్ని కళ్లకు కడుతూ, భూగోళాన్ని రక్షించుకునేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించిందంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రానురాను ప్రపంచమంతటా జనాభా పెరిగిపోతూనే ఉంది. ఈ ఏడాది నవంబర్ 15వ తేది నాటికి ప్రపంచ జనాభా 8 బిలియన్లు..అంటే 800 కోట్లకు చేరుకోబోతోందని ఐరాస ప్రకటించింది. అంతేకాదు ప్రపంచ జనాభా ఇంకా పెరిగిపోతుందని, 2030 నాటికి జనాభా 850 కోట్లకు, 2050 నాటికి 970 కోట్లకు, 2080 నాటికి ఏకంగా 1000 కోట్లకు దాటిపోయి 1004 కోట్లకు చేరుకోవచ్చని కూడా అంచనాలు కట్టింది. మన దేశంలోనూ జనాభా పెరుగుదల విపరీతంగా పెరిగిపోతూనే ఉంది. ఇప్పటిదాకా ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఏ దేశంలో ఉందంటే చైనాలోనని చెప్పుకునేవాళ్లం. మరో ఏడాదిలో ఆ స్థానాన్ని ఇక భారత్ అధిగమించబోతోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ అగ్రస్థానానికి చేరుకోబోతుందన్నది కూడా ఐరాస తన నివేదిక ద్వారా స్పష్టం చేసింది. జనాభాలో మనం చైనాను మించిపోబోతున్నాం. అయితే మనదేశానికి అది గర్వకారణమో లేక ఆలోచనత్మకమో విశ్లేషించుకోవాలి. ప్రస్తుతం 2022లో.. చైనా జనాభా 142.6 కోట్ల వరకు ఉండి జనాభాలో అగ్ర స్థానంలో ఉంటే, 141.2 కోట్ల మంది జనాభా ఉన్న భారత్ ఈ ఏడాదికల్లా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరిస్తుందని ఐరాస తన నివేదికలో ప్రకటించింది. 2050 నాటికి భారత్‌లో జనాభా 168.8 కోట్లకు చేరుకుంటుందని, అదే సందర్భంలో చైనా జనాభా 131.7 కోట్లకు తగ్గిపోతుందని కూడా అంచనా వేసింది. మరోవైపు..ప్రపంచ జనాభాలో 65 ఏళ్లకు పైబడిన వారు ఈ ఏడది 10శాతం దాకా ఉంటే, 2050 వచ్చేసరికి కనీసం 16 శాతానికి పెరుగుతుందని కూడా హెచ్చరించింది. వృద్ధుల సంఖ్య భారీగా పెరగనున్న నేపథ్యంలో వారి ఆరోగ్య సంరక్షణ కోసం, ఆలనాపాలనా చూడడం కోసం, సామాజిక భద్రత కల్పించడం కోసం, పింఛన్లు ఇవ్వడం కోసం ప్రభుత్వాలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించింది.

అధికజనాభాతో అనేక అనర్థాలున్నాయి. జనాభా విపరీతంగా పెరిగిపోయాక బాధపడేకంటే వీలైనంత వరకు జనాభా నియంత్రణకు ప్రయత్నించడమే ఉత్తమం. నానాటికీ వేగంగా పెరుగుతున్న జనాభా మనదేశానికి భవిష్యత్తులో ఒక పెద్ద సవాల్‌గా మారనుంది. అందుకే ముందుగా మేలుకోవాలి. ఇప్పటికే జనావాసాల కోసం అడవులు గల్లంతైపోయాయి. సహజవనరులు అడుగంటిపోయాయి. పంటపొలాలు కాస్తా ఇళ్లస్థలాలుగా మారిపోయాయి. ఇప్పటికే దేశంలో దారిద్ర్యం పెరిగిపోతోంది. ధరలు పోటీపడి పెరుగుతున్నాయి. కోట్లాదిమంది చిన్నారులు సరైన పోషణ లేక నానా అవస్థలు పడుతున్నారు. కోట్లాది మంది నిరుద్యోగులు, వారి కుటుంబాలు, ఉపాధి లేక కార్మికులు కష్టజీవులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా మేలుకోవాలి. ప్రపంచ జనాభాలో మనమే నెంబర్ వన్.. అవుతామని సంబరపడడం కాక, జనాభా సంక్షేమం కోసం ఇప్పటినుంచే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. దారిద్ర్యంతో, అర్థాకలితోనో పస్తులతోనో జీవిస్తే జీవితం నరకప్రాయం. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రప్రభుత్వాలు ఇప్పటినుంచే జనమందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలి. పరిశ్రమల సంఖ్యను, వ్యవసాయోత్పత్తులను గణనీయంగా పెంచాలి. అన్నాహారాలకు దేశంలో ఎప్పుడూ కొరత లేకుండా చూసుకోవాలి. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా దేశంలో జనాభా నియంత్రణకు అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలి. 'చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం' అనేమాట దేశవ్యాప్త నినాదం కావాలి. దేశ భవిత దృష్ట్యా ప్రతిఒక్కరూ అందుకు సహకరించి అధిక జనాభా ఉన్నా.. సమస్యలు లేని దేశంగా భారత్‌ను తీర్చిదిద్దుకోవాలి. భవిష్యత్ భారతావనిని అందంగా రూపుదిద్దుకోవాలి. ఆ కృషి ఇప్పటినుంచే.. ప్రారంభం కావాలి.

## అడ్డగోలుగా ఆక్రమణలు
# రోడ్లపైనే వ్యాపారాలు



నెల్లూరు నగరం నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. అక్రమ ఆక్రమణల నిలయంగా నగరం వర్ధిల్లుతోంది. నగరంలోని అయ్యప్ప గుడి ప్రాంతం మొదలుకుని, మినీబైపాస్, మాగుంట లే అవుట్, ముత్తుకూరు గేట్ సెంటర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు, దర్గామిట్ట, పొదలకూరు రోడ్డు, ఆర్.టి.సి, నెహ్రూబొమ్మ కూడలి, వి.ఆర్.సి సెంటర్, పొగతోట, గాంధీ నగర్, గాంధీబొమ్మ సెంటర్, కొత్తహాలు కూడలి, ట్రంకురోడ్డు, ఏ.సి. సెంటర్, సంతపేట, నర్తకి సెంటర్, సుబేదారుపేట, బృందావనం, ఆత్మకూరు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, పప్పులవీధి, లక్ష్మీపురం... ఇలా మొత్తం నగరంలోని వ్యాపార ప్రాంతాలన్నీ

## సమస్యల తో 'రణం'

దురాక్రమణలతో నిండిపోయి ఉన్నాయి. తమ వ్యాపారాలను నిర్వహించుకునే షాపుల బయట పార్కింగ్ కోసం నిర్దేశించిన స్థలాలను తాము అమ్మే ఉత్పత్తులతో నింపేస్తున్నారు. కొన్ని చోట్ల స్టీల్, సిమెంట్, హార్డ్‌వేర్, దుకాణదారులైతే ఏకంగా రోడ్లని తమ వ్యాపార కేంద్రాలుగా మార్చేసుకుంటున్నారు. రోడ్లపైనే వస్తువులను డంప్ చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు.

నగరమంతా ఇదే పరిస్థితి. వ్యాపార దుకాణాలు ఉండే ప్రతి ప్రాంతంలోనూ ఇదే తంతు. వీరిని ప్రశ్నించే ధైర్యం కార్పొరేషన్ అధికారులకు, పోలీసు శాఖ వారికీ లేదు. ప్రతి వ్యాపార విభాగానికీ ఒక అసోసియేషన్ ఉంటుంది. వారి వెనుక ఓ రాజకీయ నేత ఉంటాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులకు వీళ్ళు లొంగిపోతారు. అందరూ చందాలేసుకుని వాళ్ళ అవసరాలను గమనిస్తుంటారు. ఇది ప్రతి చోటా జరిగేదే, అనాదిగా వస్తున్న ఆనవాయితీయే. కానీ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వాళ్ళు ఎలా ఉరేగినా ఫరవాలేదు. కళ్ళు తిరిగే వడ్డీతో కోట్ల కొద్దీ టాక్సులు చెల్లిస్తున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ తమ వ్యాపారాలు కొనసాగించుకోవాలనుకోవడం భావ్యం కాదు.

ఆర్థిక స్తోమత లేని చిరు వ్యాపారులు, రోడ్లపైనా, ఫుట్‌పాత్‌లపైనా నెట్టుడు బళ్ళు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారంటే అర్థముంది, వారికి అదే జీవనాధారం, బ్రతుకు దెరువు. భారీ సముదాయాలలో లక్షల రూపాయల వ్యాపారాలు కొనసాగిస్తూ, రోడ్లను, పార్కింగ్ ప్రదేశాలను తమ వ్యాపార అవసరాల కోసం దురాక్రమించుకోవడం అన్యాయం. సంబంధిత ప్రభుత్వ అధికారులు పోలీసు శాఖ సహకారంతో ఈ దురాక్రమణ సంప్రదాయాన్ని నిరోధిస్తే నగరం బాగుపడుతుంది.

- సంచారి

## లాయర్ 'విజయపథంలో నెల్లూరీయులు'
# వ్యాసపీఠంపై నిలిచే అధ్యయన గ్రంథం

ఒక వారపత్రిక నిబద్ధతతో నలభై వసంతాలు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వార్తావిశేషాలను పాఠకులకందించి 'ప్రభ'త్వాలతో తలపడి తలపండటం గర్వకారణం.

'లాయర్' 40వ పుట్టినరోజు కానుకగా 'విజయపథంలో నెల్లూరీయులు' పేరుతో వెలువడిన విశేష సంచిక.. విశిష్ట సంచికగా, చిరస్మరణీయ విజ్ఞాన సర్వస్వంగా రూపుదాల్చే ప్రయత్నం చేసిన సంపాదకులు అభినందనీయులు. స్ఫూర్తిదాతలుగా ఎంచుకున్న 40 మంది సింహపురి చైతన్యస్ఫూర్తికి విజయకేతనాలు. జాతి రత్నాలు. పారిశ్రామిక, సామాజిక, విజ్ఞానశాస్త్ర రంగాలలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హేమాహేమీలు. ప్రపంచ చరిత్రపుటల్లో నిలిచిపోయే ఘనకీర్తులు. వారికి సంబంధించిన సమగ్ర జీవన రేఖలను సింహపురి చిత్రపటానికి పూమాలగా అలంకరించిన పత్రిక యాజమాన్యం జీవితం ధన్యం.

కీర్తిమూర్తులు : ఈ విభాగం సాహిత్య చరిత్ర పరిశోధకులకు జ్ఞాన భాండాగారం. తిక్కన, వేదం, వావిళ్ల, దువ్వూరి, పఠాభి, శేషంద్ర, ముదివర్తి, ఆత్రేయ, మల్లెమాల, మరుపూరు తదితర సాహితీ దిగ్గజాల సంస్మరణ ప్రశస్తం. జాతీయ స్థాయిలో చలనచిత్ర పరిశ్రమలో విజయకేతనాలు ఎగురవేసి తమదైన బాటలో నడిచిన ఘంటసాల, యస్వీ, వై.వి.రావు, రమణారెడ్డి, రాజనాల, నాగభూషణం, వెన్నెలకంటి, ప్రభృతులకు నీరాజనం సమర్పించిన తీరు చారిత్రకం. రాజకీయ రణరంగధీరులు పొట్టి శ్రీరాములు, పుచ్చలపల్లి, బెజవాడ, రేబాల, జి.సి.కొండయ్య, ఏ.సి., తిక్కవరపు, తుంగా, వెన్నెలకంటి, నేదురుమల్లి, నల్లపురెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు ధైర్యస్థైర్యాల విశ్లేషణ అద్భుతం. ఇంగ్లీషులో 'కాఫీ టేబుల్' బుక్ అని సంపాదకుడు తుంగా శివప్రభాతరెడ్డి(ప్రభ) ముందుమాటలో వివరించాడు కానీ, నా ఉద్దేశంలో ఇది 'వ్యాసపీఠం'పై నిత్యం కొలువుదీరవలసిన అధ్యయన గ్రంథం.

– డా. ఆర్. అనంతపద్మనాభరావు, రిటైర్డ్ ఏడిజి, దూరదర్శన్, ఢిల్లీ.

# చిరంజీవి కంటే కృష్ణకే అర్హత ఎక్కువ

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు. ఆయన 125వ జయంతి సభని యావత్ భారతావని గర్వించేలా నిర్వహించాయి కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు. ఇది తిరుగుబాటు తెలుగు వీరుడికి దక్కిన అరుదైన గౌరవం. జులై 4న భీమవరంలో జరిగిన అల్లూరి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చిరంజీవిని ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వం, 'నటశేఖర' కృష్ణని పిలవకపోవడం అన్యాయం. గోరంతను కొండంత చేసి కథలు అల్లే తెలుగు దినపత్రికలు సైతం పట్టించుకోని ఈ విషయాన్ని మన 'లాయర్' పత్రికలోనే ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రచురించడం 'లాయర్' నిబద్ధతకు నిదర్శనం. మీరు రాసినట్లుగా అల్లూరి సీతారామరాజు కథను 1974 వెండితెరపైకి ఎక్కించారు కృష్ణ. నాటి తరం తెలుగువాళ్లకే కాకుండా భవిష్యత్ తరాల వారు కూడా ఆ సినిమా ఎప్పుడు చూసినా అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తి వారిలో ఉత్తేజం కలిగించేలా ఆ చిత్రాన్ని రూపొందించారు కృష్ణ. నిజానికి కృష్ణ సినీ నటజీవితంలో కలికితురాయిగా నిలిచిన ఆయన 100వ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. అలాంటి వ్యక్తిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విస్మరించడం అన్యాయం. ఏ విధంగా చూసినా ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి మెగాస్టార్ కంటే సూపర్‌స్టార్‌కే అర్హత ఎక్కువ. అలాంటిది కృష్ణను వదిలేసి కేవలం చిరంజీవికి ప్రత్యేక స్థానం కల్పించడం ఓట్ల రాజకీయానికి అద్దం పడుతుంది.

సి. నందకుమార్, చెన్నై.

# యోగాపై సంపాదకీయం సందేశాత్మకంగా ఉంది

జూన్ 21, 2022న, 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా... 'లాయర్' పత్రికలో మీరు యోగాను గురించి ప్రచురించిన సంపాదకీయం చాలా గొప్పగా చక్కగా ఉంది. ముందుగా మీకు నా అభినందనలు. భారతదేశంలో యోగా పుట్టుక గురించి, వ్యాప్తి గురించి, యోగా ప్రాశస్త్యాన్ని గురించి ఎంతో అర్థవంతంగా వివరించిన విశ్లేషణాత్మకమైన ఎడిటోరియల్ పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటుందనడానికి ఎలాంటి సందేహం లేదు !

మనం యోగా మంత్రం పఠించాల్సింది కేవలం జూన్ 21వ తేదీన మాత్రమే కాదు అని, యోగాను మన నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని ముగింపు పలకడం కూడా చాలా మంచి సందేశం!

అభినందనలతో...

డాక్టర్ ఎం. పెంచల్‌రెడ్డి, ఫిజియోలజిస్ట్ - యోగా థెరపిస్ట్, నెల్లూరు.

## పాఠకులకు మనవి..!

మన లాయర్ పత్రికలో ప్రచురిత మవుతున్న అంశాలపై మీ అభిప్రాయాలను, సమాజ అభ్యుదయం కోసం ఉపకరించే మీ ఆలోచనలను మాతో క్లుప్తంగా పంచుకోండి. విషయ ప్రాధాన్యతను బట్టి వాటిని 'ప్రజావాణి'లో ప్రచురిస్తాం.

మీ భావాలను పంపవలసిన వాట్సాప్ నెంబర్: 98663 14741.

సం/-

# సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వర్షాకాలం రానేవచ్చింది. దీంతో పాటు సీజనల్ వ్యాధులు కూడా కాచుకుని కూర్చున్నాయి. వైరల్ జ్వరాలు, డెంగ్యూ వంటి వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం. వైద్య ఆరోగ్య శాఖవారు కూడా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తే మంచిది.

ఎస్. శేషుకుమార్, నెల్లూరు.



## ద్రౌపది ముర్ముకు... నెల్లూరు నేతల అభివందనాలు

ఎన్డీఏ తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ద్రౌపదిముర్ము ఈ నెల 12న విజయవాడకు విచ్చేసిన సందర్భంగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను పరిచయం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి.

### మాతృభాషలో విద్యార్థులు చదువుకునేందుకు

# ఆచార్య సిఎంకెరెడ్డి న్యాయపోరాటం

## సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు



***తమిళనాడులోని తెలుగు విద్యార్థులు, ఇతర మైనార్టీ భాషల విద్యార్థులు మాతృభాషలోనే చదువుకునేందుకు చెన్నైలో ఆచార్య సిఎంకె రెడ్డి ఎంతో కాలంగా న్యాయపోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా ఈ విషయంలో విద్యార్థులకు శాశ్వత ప్రాతిపదికపై ఉపశమనం కలిగేలా ఉత్తర్వులిచ్చి తద్వారా వారి రాజ్యాంగహక్కులను పరిరక్షించాలని అభ్యర్థిస్తూ ఆయన ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై త్వరలోనే విచారణ జరుగుతుందని భావిస్తున్నారు.***

తమిళనాడులో ఉన్న తెలుగు విద్యార్థులు తమ మాతృభాష అయిన తెలుగుభాషలోనే చదువుకునే విధంగా అవకాశం కల్పించాలని, అదేవిధంగా అక్కడున్న కన్నడ, మలయాళ, ఉర్దూ తదితర మైనారిటీ భాషల వారిని కూడా మాతృభాషలోనే చదువుకోనివ్వాలని కోరుతూ చెన్నైలోని ఆచార్య సిఎంకె రెడ్డి సారథ్యంలోని లింఫోట్ (లింగ్విస్టిక్ మైనార్టీస్ ఫోరం ఆఫ్ తమిళనాడు) సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సంస్థ ఎంతోకాలం నుంచి తమిళనాడులో మైనార్టీ భాషల పరిరక్షణ కోసం పోరాడుతోంది.

తమిళనాడులో 'నిర్బంధ తమిళం' పేరుతో గతంలో ఇచ్చిన జిఓతో ఆ రాష్ట్రంలోని తెలుగు విద్యార్థులు, మైనార్టీల విద్యార్థులు తమ మాతృభాషలో చదువుకునే అవకాశం కోల్పోతున్న నేపథ్యంలో, ఆచార్య సిఎంకె రెడ్డి నేతృత్వంలో లింఫోట్ ప్రతినిధులు ప్రతి ఏడాది హైకోర్టుకు వెళ్ళి ఆ విషయంపై మధ్యంతర ఉత్తర్వులు తెస్తున్నారు. దాంతో కాస్త ఉపశమనం కలుగుతోంది. అయితే, గత ఏడాది హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు గత విద్యాసంవత్సరంతో ముగిశాయి కనుక గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు పొడిగించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని అభ్యర్థిస్తూ 'లింఫోట్' అధ్యక్షులు, ఆచార్య సిఎంకె రెడ్డి తాజాగా ఇటీవల సుప్రీంకోర్టులో స్పెషల్‌లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. మాతృభాషలోనే చదువుకునేలా ఉత్తర్వులిచ్చి విద్యార్థులకు శాశ్వత ఉపశమనం కల్పించేలా ఆదేశించాలని ఆయన సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తద్వారా భాషాపరమైన మైనార్టీల రాజ్యాంగహక్కులను పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమిళం నేర్చుకునేందుకు, ఆ భాషలో చదువుకునేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని, అయితే తమిళంతో పాటు మాతృభాషలో కూడా చదువుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించాలని ఆయన సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఈ విషయాలపై త్వరలోనే విచారణ జరుగనుందని ఆశిస్తున్నారు.

# 'విపిఆర్ విద్య'లో విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి


## అందజేసిన విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విపిఆర్ విద్యలో చదువుకుంటున్న 6వ తరగతి విద్యార్థులకు విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, ఎస్వీ టెంపుల్, టిటిడి ఇన్ఫర్మేషన్ సెంటర్ న్యూఢిల్లీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 13న పుస్తకాలు, యూనిఫాం, షూస్ తదితర సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో 'విపిఆర్ విద్య' పాఠశాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించాలనే ధ్యేయంతో, సమాజానికి తమ వంతు సేవగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ విద్యాసంస్థను ప్రారంభించారని, ప్రతి ఏటా 6వ తరగతిలో ఉత్తమంగా రాణిస్తున్న విద్యార్థులను ఎంపికచేసి వారికి మరింత సమగ్రమైన విద్యను అందిస్తూ విద్యార్థులను నైతిక విలువలతో, క్రమశిక్షణతో తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. 10వ తరగతిలో పాఠశాల ప్రథమశ్రేణిలో మొదటి ర్యాంక్ పొందినవారికి ఇంటర్మీడియట్ నుంచి ఇంజనీరింగ్ వరకు ఉచితంగా విద్యనభ్యసించేందుకు విపిఆర్ ఫౌండేషన్ తోడ్పడుతుందని చెప్పారు. విపిఆర్ విద్యకు ఉన్నతమైన విలువలున్నాయని, నిబద్ధతతో క్రమశిక్షణతో పాఠశాలను నిర్వహిస్తునామని, పాఠశాల విద్యార్థులు బాగా చదువుకుని రాణించాలని విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొఫెసర్ వి.నారాయణ రెడ్డి అన్నారు. విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డా. కళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం'

## 12వ భాగం




అలా దేవయానిని శర్మిష్ఠ బావిలోకి తోసి వెళ్ళిపోయినా తరువాత, అటుగా వేటకి వచ్చిన యయాతి మహారాజు కుడి చెయ్యి అందించి బావి లోంచి తీసి తన రాజధానికి వెళ్ళిపోతాడు.

దేవయాని బావి గట్టు మీద కూర్చుని ఏడుస్తుంది. ఇంతలో ఆమె చెలికత్తె ఘూర్ణిక వెతుక్కుంటూ వచ్చి అంతా అర్థం చేసుకుని వెళ్లిపోదామంటే వినక, ఆ రాక్షసరాజు రాజధానిలో అడుగుపెట్టానని, తండ్రికి చెప్పి ఆయన్ను రమ్మనమని చెపుతుంది. ఘూర్ణిక వెళ్లి చెప్పటంతో శుక్రాచార్యుడు గబగబా దేవయాని దగ్గరకు వస్తాడు. తండ్రిని చూసి ఏడుస్తుంది. శుక్రాచార్యుడు చాలా ఓదార్చి, శర్మిష్ఠ చిన్నపిల్ల, పట్టించుకోవద్దు అని చెప్పినా ఊరుకోదు, శర్మిష్ఠ చేసిన అవమానాలు అన్నీ చెపుతుంది. శుక్రాచార్యునికి కూడా కోపం వచ్చి మనం ఇంకో ప్రదేశానికి వెళ్ళిపోదాం అంటాడు.

చారుల ద్వారా తెలుసుకున్న రాక్షసరాజు హుటాహుటిన అక్కడికి వచ్చి బ్రతిమిలాడతాడు. అయినా శుక్రాచార్యుడు ఒప్పుకోక, దేవయాని ఇష్ట ప్రకారం చెయ్యమంటాడు. అప్పుడు రాక్షసరాజు దేవయానిని ఏ కోరికయినా కోరుకో, నేను తీరుస్తాను అన్నప్పుడు, శర్మిష్ఠ, ఆమె చెలికత్తెలందరూ తనకు దాసులు అవ్వాలని, తనతో పాటు అత్తగారింటికి రావాలని కోరుతుంది. అలాగే అని రాక్షస రాజు శర్మిష్ఠని పిలిపిస్తాడు. శర్మిష్ఠ అర్థం చేసుకుని, తన రాక్షస జాతికి మేలు చెయ్యటమే తన కర్తవ్యమని ఒప్పుకుంటుంది. దేవయాని విజయగర్వంతో మళ్ళీ రాజధానికి బయలు దేరుతుంది.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**

**పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**

# 20న రామాయపట్నం పోర్టుకు శంకుస్థాపన

## ○ విచ్చేయనున్న ముఖ్యమంత్రి జగన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కరికాల వలవన్, కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరుజిల్లాలో నూతనంగా కలసిన గుడ్లూరు మండలంలోని రామాయపట్నం పోర్టు శంకుస్థాపనకు ఈనెల 20న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్ కరికాల వలవన్, జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈ నెల 12న రామాయపట్నంలో ఏర్పాట్లు పరిశీలించారు. శంకుస్థాపన వద్ద ఏర్పాటు చేస్తున్న పైలాన్, హెలిప్యాడ్ నిర్మాణ పనులను చూసి అధికారులకు తగు సూచనలిచ్చారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కరికాల వలవన్ మాట్లాడుతూ ఈ పోర్టుకు సంబంధించి భూసేకరణ పనులు దాదాపు పూర్తయ్యాయని, పోర్టు ఏర్పాటుతో అటు పరిశ్రమలు, ఇటు పర్యాటకరంగం అభివృద్ధి చెందుతాయని, నెల్లూరు–ప్రకాశం రెండు జిల్లాలు అభివృద్ధి చెందడమే కాక, పరిశ్రమల ఏర్పాటు వల్ల వేలాదిమందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్, నీటిపారుదల శాఖ ఎస్ఇ కృష్ణమోహన్, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, కందుకూరు ఆర్డీఓ సుబ్బారెడ్డి, పోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఐవి రెడ్డి, ఇఇ వీరయ్య, డిఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# నెల్లూరు కబుర్లు

## 29న కార్పొరేషన్ సమావేశం

జులై 29న నెల్లూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని నగర మేయర్ పొట్లూరి స్రవంతి ఈనెల 12న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

### జెఇఇ మెయిన్స్‌లో

## సత్తాచాటిన కృష్ణచైతన్య విద్యార్థులు



ఇటీవల ప్రకటించిన జెఇఇ (మెయిన్) ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్ విద్యార్థులు తమ సత్తా చాటారు. జాతీయ స్థాయిలోనూ మంచి పర్సెంటైల్స్ సాధించి కళాశాల ప్రతిష్టను ఇనుమడింపజేశారు. జాతీయస్థాయిలో జరిగిన ఈ పరీక్షల్లో పి.పవన్‌సాయి 97.72 పర్సంటైల్‌ను సాధించి ప్రథమస్థానం సాధించడం విశేషం. అదేవిధంగా జి.వెంకట అవినాష్ 97.31 పర్సంటైల్‌తో ద్వితీయస్థానం సాధించాడు. ఇంటర్‌తో పాటు జెఇఇ మెయిన్స్‌లో కె. హరిచరణ్‌కృష్ణ జాతీయస్థాయిలో 96.93 పర్సంటైల్‌ను, సుమవర్ష 96.50, బి.మునివెంకట్ 95.71, శర్వన్‌సింగ్ 92.62 పర్సంటైల్ వంతున సాధించి అందరి అభినందనలు అందుకున్నారు. ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు అభినందించారు. కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల డీన్ రామాంజనేయరెడ్డి, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్‌డీన్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్‌లో గురుపూర్ణిమ వేడుకలు



గురుపూర్ణిమ పర్వదినం సందర్భంగా నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న పద్మావతి నగర్ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 12న వేడుకలు ప్రారంభించారు. శ్రీషిర్డీ సాయినాధునికి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని ఏసినగర్ సీతారామ మందిరం నుంచి సాయిదర్బార్‌కు విచ్చేసిన శ్రీ సీతారామ లక్ష్మణుల సన్నిధిలో విష్వక్సేన పూజ, కలశస్థాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని తరించారు. మందిరం ఛైర్మన్ మధుసాయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

## ఫ్రెండ్స్ వాకర్స్..అన్నదానం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న స్థానిక రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో 80 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు మాగంటి ప్రసాద్ మాతృమూర్తి స్వర్గీయ మాగంటి సరోజనమ్మ 12వ వర్ధంతిని పురస్కరించుకుని దివ్యాంగులైన విద్యార్థులకు భోజనం సమకూర్చారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ వాకర్స్ సభ్యులు తమ కుటుంబాలకు సంబంధించిన ప్రత్యేక సందర్భాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మంచిదని సూచించారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గుర్నాథరావు, సంఘం గౌరవ సలహాదారు వినుకొండ వెంకటేశ్వర్లు, కార్యవర్గసభ్యులు ఏవి సుబ్బరాజు, ఆదినారాయణ రెడ్డి, చెంచయ్యనాయుడు, సాయిసుబ్బారావు, హరిబాబు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి

### కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవి



రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ళ కాలనీల నిర్మాణాలను అధికారులు త్వరగా పూర్తిచేసి పేద లబ్దిదారులకు అందించాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవి ఆదేశించారు. ఈనెల 11న ఆమె కార్పొరేషన్ ఇంజనీర్లు, గృహనిర్మాణాల అధికారులతో స్థానిక వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి లబ్దిదారునికి శాశ్వత గృహ హక్కు పథకం వర్తించేవిధంగా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు.

### నృత్య గానాలతో..

## నారాయణతీర్థుల జయంతి



నెల్లూరులోని టీవీఎస్ కల్యాణసదన్‌లో ఈనెల 10వ తేదిన సద్గురు నారాయణతీర్థుల జయంతి వేడుకను నృత్యగానాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గురుకృప కళాక్షేత్రం నృత్యకళాకారులు శాస్త్రీయ నృత్యాలతో అలరించగా, ప్రముఖ సంగీత విద్వాంసులు బాలార్క, లక్ష్మీప్రసన్న, లక్ష్మీకామాక్షి, అరుణ, వనజలతతో పాటు వీణాత్రయంగా పేరొందిన హేమలక్ష్మి, పద్మా చక్రవర్తి, నాగలక్ష్మి నారాయణతీర్థుల వారి సంకీర్తనలను వీనులవిందుగా ఆలపించారు. లోకేష్‌బాబు, వేదవ్యాసపాయ్, సుబ్రహ్మణ్యం, శివకుమార్, ఈశ్వర్‌పాయ్, వాద్య సహకారం అందించారు. అనంతరం టీవీఎస్ కల్యాణసదన్ మేనేజింగ్ ట్రస్టీ ఫణిరత్నం, పరాశర్, ఎనమండ్ర నాగదేవిప్రసాద్, రాఘవేంద్రరావు, రామచంద్రమూర్తి తదితరులు పర్యవేక్షించారు.

## రత్నశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. గురువైభవ సప్తాహం



నెల్లూరులోని రత్నశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువైభవ ప్రవచన సప్తాహం జరుగుతోంది. ఈనెల 14వ తేది వరకు నెల్లూరు పురమందిరంలో ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 8.30 గంటల దాకా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శ్రీవిద్యోపాసకులు, ప్రముఖ ప్రవచనకర్త మండే లక్ష్మీనరసింహారావు గురువైభవాన్ని వివరిస్తున్నారు. సనాతన హైందవధర్మంలో గురువుకు విశేషమైన స్థానం ఉందని, గురువు ఆశీస్సులు ఉంటే ఎంతటి క్లిష్టమైన కార్యాన్నయినా సాధించవచ్చని, గురువు అనుగ్రహంతోనే అన్నీ ప్రాప్తిస్తాయని ఆయన తన ప్రారంభోపన్యాసంలో వివరించారు. నారాయణ మంత్రం మహిమాన్వితమైనదని, పాపప్రక్షాళనకు నారాయణ మంత్ర జపమే తరుణోపాయమని ఈనెల 10న జరిగిన ప్రవచనంలో చెప్పారు. టి.శ్రీకాంత్‌శర్మ, భాస్కరశర్మ, చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, మల్లవరపు లక్ష్మీనరసింహం, నజీర్‌బాషా, భువనేశ్వరిప్రసాద్, శ్రీహరి, రాఘవ వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి, అధిక జనాభా వద్దంటూ ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రతిఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. ఎన్‌సిడి నోడల్ అధికారి వెంకటరమణ, డాక్టర్ భాస్కర్, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో అధికారి శ్రీనివాసులు, డిపిహెచ్‌ఎన్‌ఓ ఖాలోకమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, పిఎంపి జిల్లా అధ్యక్షుడు శాఖవపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నకు జేజేలు

### వేడుకగా వైఎస్ జయంతి



దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 73వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని రాజన్న అభిమానులు, వైకాపా కార్యకర్తలు, నాయకులు, అధికారులు, ప్రజలు ఆ మహానాయకుని స్మరించుకుని ఆయన స్మృతికి నీరాజనాలర్పించారు. ఊరూరా రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి అలంకరించారు. పలుప్రాంతాల్లో కేకులు కట్ చేసి అందరికీ పంచుతూ రాజన్న పుట్టినరోజు వేడుకలను పండుగలా జరుపుకున్నారు. నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహం పూలమాలికల అలంకరణలతో కళకళలాడింది. అనేకమంది నాయకులు, అధికారులు ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.

**వైఎస్సార్ ఆశయాల బాటలో నడుద్దాం :** దివంగం ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల బాటలో నడుద్దామంటూ నెల్లూరు గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం నగర డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్ అన్నారు. వైఎస్ ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. నగర కార్పొరేటర్లు, నాయకులు వేలూరు మహేష్, కర్తం ప్రతాప్‌రెడ్డి, రాఘవరావు, శ్రీకాంత్‌రెడ్డి, రవిచంద్ర, రామకృష్ణ ఆచారి, కరిముల్లా, సంక్రాంతి కల్యాణ్, ఎంవి సుబ్బారెడ్డి, ఇంతియాజ్, సిద్దిక్, తారీఖ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య విద్యార్థులకు..

## ప్రోత్సాహక నగదు బహుమతులు



నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలో వెలసి ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల10న ఆర్యవైశ్య విద్యార్థులకు నుడా ఛైర్మన్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇటీవల టెన్త్‌లో 500మార్కులకు పైగా సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు అర్బన్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ వాసవి మాత విద్యాకానుకల పేరుతో ఈ బహుమతులందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పీర్ల సీతారామారావు, కోట గురుబ్రహ్మం, కోట సూర్యనారాయణ, చరణ్‌కుమార్, గాదంశెట్టి జ్యోతి ప్రసాద్, 8వ డివిజన్ కార్పొరేటర్ మొగళ్ళపల్లి కామాక్షిదేవి, గుండ్లపల్లి పద్మప్రియ, వాయుగుండ్ల సుప్రియ, చిన్ని పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### జగన్ ఎన్ని కుట్రలు పన్నినా..

## చంద్రబాబు సిఎం అయ్యేది ఖాయం

### తాళ్లపాక అనూరాధ



ముఖ్యమంత్రి జగన్, వైకాపా ప్రభుత్వం ఎన్నికుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని టిడిపి మహిళా నాయకురాలు తాళ్లపాక అనూరాధ ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేయాలన్న లక్ష్యంతోనే ఇటీవల వైకాపా ప్లీనరీ జరిగిందని, రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే వైకాపా నాయకులంతా ప్లీనరీలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడుపై లేనిపోని విమర్శల చేశారని ఆమె చెప్పారు. ఈనెల 10న నెల్లూరులోని మూలాపేటలో ఉన్న గంగమ్మ దేవాలయంలో ఆమె పూజలు చేసి వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏ.ప్రసాద్, కొత్తూరు మురళీమోహన్, ఉమామహేశ్వర్, కార్తీక్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతుల నేతృత్వంలో..

# ఆగస్టు 16 నుంచి శ్రీవారి వైభవోత్సవాలు





ప్రముఖ వదాన్యులు, రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల నేతృత్వంలో ఆగస్టు 16 నుంచి 20వ తేది వరకు అయిదురోజుల పాటు అత్యంత వైభవంగా శ్రీవారి వైభవోత్సవాలు జరుగనున్నాయి. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుమల ఆలయంలో రోజువారీ నిర్వహించే అన్నిరకాల సేవలు, పూజలు నెల్లూరుజిల్లా ప్రజలు కూడా ప్రత్యక్షంగా తిలకించి తరించే విధంగా నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం ప్రాంగణంలో గతంలో 2015 ఆగస్టు 8 నుంచి శ్రీవారి వైభవోత్సవాలు దివ్యంగా జరగడం అందరికీ తెలిసిన విషయమే. తిరుమల ఆలయ అర్చకులే స్వయంగా వచ్చి శ్రీవారికి సుప్రభాత సేవ దగ్గర నుంచి తోమాలసేవ, కొలువు, అర్చన, నివేదన, శాత్తుమొర, సహస్రదీపాలంకార సేవ, ఏకాంతసేవ తదితర సేవలు కన్నులపండువగా నిర్వహించడం, ఆ తిరుమలేశుడే నెల్లూరుకు వచ్చి కొలువుదీరారా.. అన్నంత వేడుకగా వైభవోత్సవాలు జరగడం నెల్లూరీయులకు గుర్తుండే ఉంటుంది.

ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి మళ్ళీ ఆ వైభవోత్సవాల వేడుకలు కనులారా చూసే భాగ్యం కలుగనుంది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించేందుకు ఈనెల11న జరిగిన పాలక మండలి సమావేశంలో నిర్ణయించినట్లు టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు.

## ఆదాలకు.. సచివాలయ ఉద్యోగుల ఆహ్వానం



ఈనెల 17వ తేది ఆదివారం తాము నిర్వహించే అభినందన సభకు విచ్చేయవలసిందిగా సచివాలయ ఉద్యోగులు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం పలికారు. ఆరోజున కస్తూర్బా కళాక్షేత్రంలో ఆత్మీయ అభినందన సభ జరుగనుందని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శాశ్వత ఉద్యోగుల ధృవీకరణను ప్రకటించిన సందర్భంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఉద్యోగ నేతలు సతీష్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, సురేష్‌బాబు, బాలరాజు, మల్లికార్జున తదితరులు ఆదాలను ఇటీవల ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు.

## రైళ్ల కోసం..ఎంపీ ఆదాలకు విజ్ఞప్తి



జిల్లాల విభజన కారణంగా తిరుపతి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు ప్రయాణించేందుకు రెండు రైళ్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ఛైర్మెన్ చేజర్ల సుధాకర్‌రావు ఈనెల 12న నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలసి విజ్ఞప్తిచేశారు. నెల్లూరు నుంచి సూళ్లూరుపేట, తిరుపతి మార్గాల్లో ఉదయం 6.30 నుంచి 7.30 మధ్య రెండు రైళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గతంలో రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని సుధాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, ఉద్యోగ సంఘాల నేతలు రమణారెడ్డి, కమల్ కిరణ్, శేషగిరిరావు, సతీష్‌రెడ్డి, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా విక్రమ్ ప్రమాణస్వీకారం



ఇటీవల నెల్లూరుజిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో గెలుపొందిన మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఈనెల 11న ప్రమాణస్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వెలగపూడిలోని తన ఛాంబర్‌లో విక్రమ్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, శాసనసభ కార్యదర్శి పి.బాలకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### గురుపౌర్ణమి సందర్భంగా..

## భాగవత సప్తాహం



గురుపౌర్ణమి సందర్భంగా నెల్లూరు నవలాకులతోట వద్ద ఉన్న శ్రీ సాయి ధర్మక్షేత్రంలో శ్రీ షిర్డీ సాయినాధునికి ఈనెల 12 నుంచి 14వ తేది దాకా ప్రత్యేక పూజలు, హారతులు, భజనలు, గురుచరిత్ర పారాయణం తదితర కార్యక్రమాలను మందిరం ధర్మకర్త సాయికుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణలతో సాయినాధుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 4వ తేది నుంచి భాగవత సప్తాహం వీనుల విందుగా నిర్వహించారు. స్థానిక పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సప్తాహంలో 4వ తేదిన డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు (భాగవతం- కృష్ణ తత్వం), 5న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు (ప్రహ్లాద చరిత్ర), 6న పోలవరపు లక్ష్మీనరసింహారావు (అంబరీషోపాఖ్యానం), 8న విద్వాన్ సూరం చంద్రశేఖరం (భాగవత ఆవిర్భావం-అవతార విభూతి), 9న శతావధాని డా.సూరం శ్రీనివాసులు (కుచేలోపాఖ్యానం), 10న కర్లపూడి కృష్ణ (సాయితత్వం-లీలలపై విశ్లేషణ), 11న డా. చీమకుర్తి (గజేంద్రమోక్షం), 12న అవధాని కోట రాజశేఖర్ (రుక్మిణీ కల్యాణం)లు పాల్గొని ఉపన్యసించారు.

## ఆత్మీయ కలయిక



తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆత్మీయంగా కలసి కోవూరు నియోజకవర్గ అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించారు. ప్రసన్న తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

## జెఇఇఓలో 'విశ్వసాయి' ప్రతిభ



ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలల విద్యార్థులు 70 మందికి పైగానే జాతీయస్థాయిలో ఉత్తమ పర్సంటైల్‌తో రాణించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. వీరిలో పి. హేమంత్‌కుమార్‌రెడ్డి 98.71 పర్సంటైల్ సాధించాడని, మరో 10 మంది విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్‌తో, 35 మంది విద్యార్థులు 80 పర్సంటైల్ కంటే ఎక్కువగానే సాధించారని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్‌లు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరంతర కృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఇంతటి విజయాలకు కారణమని వారు పేర్కొన్నారు. ఉత్తమ పర్సంటైల్స్ సాధించిన విద్యార్థులందరినీ వారు అభినందించారు.

## పెద్దాసుపత్రిని సందర్శించిన కేంద్ర వైద్యబృందం

### 23.77 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు పరిశీలనలు



నెల్లూరు పెద్దాసుపత్రిలో క్రిటికల్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రబృందం ఈనెల 12న పరిశీలనలు చేసింది. కేంద్ర ప్రభుత్వ హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ వర్మ, యుఎన్‌ఏ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ బృందం, ఎన్‌హెచ్‌ఎం విజయవాడ టెక్నీషియన్ విజయ్ తదితరులు స్థానిక వైద్యాధికారులతో కలసి నెల్లూరులోని పెద్దాసుపత్రిని పరిశీలించి వసతుల విషయం అడిగి తెలుసుకున్నారు. 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమం కింద 23.77 కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరులో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని డాక్టర్ వర్మ చెప్పారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు మాట్లాడుతూ కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలో రోగులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఉపయోగంగా ఉంటుందని, క్రిటికల్ కేర్ యూనిట్ కోసం ఆ నిధులతో 50 పడకలతో కూడిన మూడంతస్తుల భవనాన్ని కూడా నిర్మించనున్నారని తెలిపారు.







## చెన్నై అపోలోలో 500కు పైగా..

# రోబోటిక్ కొలొరెక్టల్ శస్త్రచికిత్సలు

### అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్పర్సన్ ప్రీతారెడ్డి




పెద్దప్రేగు, పురీషనాళం మరియు మలద్వారం వద్ద వచ్చే క్యాన్సర్లకు చెన్నై అపోలో హాస్పిటల్ రోబోటిక్ సర్జరీలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. గత ఆరేళ్ళలో 500కు పైగా రోబోటిక్ కొలొరెక్టల్ శస్త్రచికిత్సలు నిర్వహించిన ఖ్యాతి గడించింది. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్పర్సన్ ప్రీతారెడ్డి మాట్లాడుతూ చెన్నై అపోలో హాస్పిటల్ కొత్త హ్యూగో రోబోటిక్ సర్జరీ సిస్టమ్‌తో మొట్టమొదటి మల క్యాన్సర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కొలొరెక్టల్ సర్జరీ 2016 నుండి కొలొరెక్టల్ వ్యాధులు, ముఖ్యంగా కొలొరెక్టల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగుల చికిత్సలో అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ రోబోటిక్ సర్జికల్ టెక్నిక్స్ మరియు టెక్నాలజీని అందిస్తూ వస్తుందని అన్నారు. 2016లో ప్రారంభించిన ఈ మల క్యాన్సర్ రోబోటిక్ శస్త్ర చికిత్సలను ఇప్పటి వరకు 530కి పైగా జయప్రదంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 500 ఆపరేషన్ల వరకు డాక్టర్ వెంకటేష్ మునికృష్ణన్ బృందం నిర్వహించిందని తెలిపారు. అనంతరం కొలొరెక్టల్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ మునికృష్ణన్ మాట్లాడుతూ ఆలస్యదశలో వచ్చే రోగుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ రోబోటిక్ సర్జరీతో పెద్దప్రేగు మలద్వారాన్ని పునర్ నిర్మించేందుకు సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేస్తున్నామని, దీని ద్వారా రోగులు పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారని తెలిపారు.



## ప్రబంధ కావ్యాలకు మార్గదర్శకం..

# 'శృంగారనైషధం'

**- శతావధాని డా. సూరం శ్రీనివాసులు**

సంస్కృతభాషలో శ్రీహర్షుడు రచించిన నైషదీయ చరిత్రను శ్రీనాథ మహాకవి శృంగారనైషధం పేరుతో అనువదించారని, శృంగారనైషధం కావ్యం ప్రబంధ కావ్యాలకు మార్గదర్శకమని, ప్రముఖ సాహితీవేత్త, శతావధాని డా. సూరం శ్రీనివాసులు అన్నారు. ఈనెల 10న నెల్లూరు, పురమందిరంలో పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సాహిత్యోపన్యాసంలో ఆయన 'శృంగారనైషధం – అనువాద రీతి' అనే అంశంపై అద్భుతంగా.. పండిత పామరజన రంజకంగా ఉపన్యసించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. మానవజీవితంలో వివాహం ఒక సంస్కారమని, దాంపత్యమనేది గొప్ప ఆదర్శమని అంటూ ఆ కావ్యంలో నలదమయంతుల దాంపత్యం అపురూపమైనదని, భారతీయ కుటుంబ వ్యవస్థ నిర్మాణానికి వారి దాంపత్యం ఆదర్శంగా నిలిచిందని ఆయన అభివర్ణించారు. ఎన్ని కష్టాలు వచ్చినా భార్యాభర్తలు ధర్మం వదలక జీవించాలన్న సందేశం అందులో ఉందన్నారు. జర్మన్‌భాషలోనూ నలదమయంతుల కథ ప్రసిద్ధమైనదిగా ఉందన్నారు. తొలుత పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి డా. చీమకుర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నెరసం అధ్యక్షుడు అనుమల జయప్రకాష్ తదితరులు పాల్గొని డా. సూరం శ్రీనివాసులును సత్కరించారు.

# విఎస్‌యులో డా.వైఎస్ జయంతి




నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఇటీవల దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి సుందరవల్లి, రిజిస్ట్రార్ డా. పి.రామచంద్రరెడ్డి తదితరులు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనల నుంచి ఆవిర్భవించిందని, ప్రతి పేద విద్యార్థికి ఉన్నత చదువులు అందుబాటులో ఉండాలనే సదాశయంతో ఆయనెంతో కృషిచేశారని అన్నారు. అందుకు తగ్గట్టుగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అహర్నిశలు శ్రమించి డా. వైఎస్ ఆశయసాధన కోసం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మలేషియా యూనివర్శిటీ ప్రతినిధితో చర్చలు



విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం మరియు మలేషియన్ యూనివర్సిటీ మధ్య అవగహన ఒప్పందం కుదుర్చుకొనేందుకు ఇటీవల విఎస్‌యులో చర్చలు జరిగాయి. మలేషియన్ యూనివర్సిటీ ప్రాంతీయ ప్రతినిధి డాక్టర్ మహమ్మద్ ఆరీఫుల్లా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి సుందరవల్లి, రిజిస్ట్రార్ పి.రామచంద్రరెడ్డితో అవగహన ఒప్పందంపై చర్చలు జరిపారు. సెమినార్‌లు నిర్వహించడం, వర్క్ షాప్స్, రీసెర్చ్ తదితర అంశాలపై ఆ యూనివర్శిటీతో ఒప్పందం కుదుర్చు కోనున్నామని, ఈ అవగహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని విఎస్‌యు నిర్వాహకులు పేర్కొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# రోటరీ క్లబ్ వెస్ట్‌కు నూతన సభ్యులు




గూడూరు రోటరీ భవన్‌లో రోటరీ క్లబ్ వెస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్ నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. రోటరీ క్లబ్ వెస్ట్‌లో నూతనంగా 30 మంది సభ్యత్వం తీసుకున్నారు. రోటరీ క్లబ్ వెస్ట్ నూతన అధ్యక్షుడు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యానని, తన అధ్యక్షతన రోటరీ క్లబ్ వెస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృత పరచి పేద ప్రజలకు అండగా నిలుస్తామని, విద్యా, వైద్య రంగాలకి అధిక ప్రాధాన్యత ఇస్తూ... నూతన కార్యవర్గం సభ్యుల ద్వారా సమిష్టిగా సేవా కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దార్ లీలారాణి, మాజీ రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, ముని గిరీష్, సీనియర్ రోటరీక్లబ్ సభ్యులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, రామ్మోహన్‌రావు, కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు పట్టణంలోని శ్రీ పాండురంగ విట్టలనాథ స్వామివారికి తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారికి విశేష అలంకరణ నిర్వహించి ఊంజల్ సేవను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు



## ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యవర్గ ఎంపిక

గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఈ నెల 10వ తేదీ ఎన్నుకున్నట్లు ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరి రోహిణి తెలిపారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సుప్రభ, జీవనిరెడ్డిలను క్లబ్ ప్రతినిధులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైనవారు పేదల కోసం విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. పేద విద్యార్థుల చదువులకు, వైద్యం కోసం సేవా కార్యక్రమాలు విరివిగా చేయాలని తెలిపారు. ప్రతినిధులు వనజామోహన్, లక్ష్మీ, అనిత, స్నేహలతారెడ్డి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## సాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు



గూడూరు షిర్డి సాయినగర్‌లో ఉన్న సాయిబాబా మందిరంలో ఈ నెల 13వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా ప్రతి సంవత్సరం లాగే సప్తాహం నిర్వహించారు. ప్రతిరోజూ మందిరంలో పల్లకిసేవ, ప్రసాద వితరణ జరిగాయి. శుక్రవారం ఉభయదాతలుగా ప్రముఖ సీనియర్ అడిటర్, ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత, బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, వారి సతీమణి పి.ఎస్.రాజ్యలక్ష్మి వ్యవహరించారు.



ఇస్కాన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇటీవల గూడూరు పురవీధుల్లో హరే కృష్ణ భజనలు, కోలాటాల మధ్య నిర్వహించిన జగన్నాధ రథయాత్ర.

## హోటల్స్‌కి కొత్త అసోసియేషన్



హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులను సన్మానిస్తున్న రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి, టౌన్ సి.ఐ నాగేశ్వరమ్మ

చిల్లకూరు మండలం లోని బూదనం సమీపంలోని ఏ–5 హోటల్‌లో ఇటీవల గూడూరు హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్షులుగా బద్రిగిరి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా రాంప్రసాద్‌లను ఎన్నుకున్నారు. రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి, టౌన్ సి.ఐ నాగేశ్వరమ్మలు పాల్గొని అసోసియేషన్ సభ్యులను సన్మానించారు.



లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గూడూరు బ్రాంచ్‌లో సీనియర్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా 34 సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసి 5 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అయోధ్య శివ సుబ్రహ్మణ్యం-శ్రీమతి పద్మ దంపతులను ఇటీవల గూడూరులోని ఎల్ఐసి కార్యాలయంలో అభినందిస్తున్న ఎల్ఐసి అధికారులు. 'లాయర్' గూడూరు ప్రతినిధి ఆనిమెళ్ళ శివకుమార్ కూడా వీరికి శుభాభినందనలు తెలిపారు.

### రైతు దినోత్సవం కాదు..

# రైతులను ముంచిన దినోత్సవం జరుపుకోండి

**- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ**



వైకాపా పాలనలో ఈ మూడేళ్లలో రైతులను పూర్తిగా నలిపేశారు.. వ్యవసాయ శాఖను దాదాపు మూసేశారు.. అబద్ధాలతో కాలం గడిపేస్తున్నారు. ఇంకా రైతు దినోత్సవాలెందుకు. రైతులను ముంచిన దినోత్సవాలు జరుపుకోండి అంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతుల సంక్షేమమంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్న వైసీపీకి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీ అబ్బీసాహెబ్ కండ్రిగ, ఎర్రగుంట్లలో ఇటీవల పర్యటించిన సోమిరెడ్డి 'బాదుడే బాదుడు' కార్యక్రమం నిర్వహించి ప్రజలకు వైకాపా పాలన వైఫల్యాలను వివరించారు. జాతీయ స్థాయిలో రైతుల కోసం అమలవుతున్న అనేక పథకాలను రాష్ట్రంలో ఆపేసిన మీరా రైతు దినోత్సవం జరుపుకునేది అంటూ వైకాపా నేతలపై ధ్వజమెత్తారు. రైతుల కోసం మూడేళ్లలో 1.27 లక్షల కోట్లు ఖర్చుపెట్టామని ప్రభుత్వం కోట్లు వెచ్చించి పత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లోని అంశాలు పచ్చి అబద్ధమన్నారు. ధాన్యం కొనుగోళ్లకు 51 వేల కోట్లు ఖర్చుపెట్టామంటున్నారు...రైతుల వద్ద ధాన్యం కొని బియ్యం చేసి అమ్ముకుంటే అది ఖర్చు ఎలా అవుతుందో వారికే తెలియాలని విమర్శించారు. నెల్లూరు జిల్లాలో రైతు భరోసా కోసం రూ.4815 కోట్లు ఖర్చుపెట్టామంటున్నారు.అది పాత నెల్లూరు జిల్లానో, కొత్త నెల్లూరు జిల్లానో వారికే తెలియాలని, నిజంగా ఆ మొత్తం రైతుల కోసం రైతు భరోసా కింద ఖర్చుపెట్టివుంటే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి వ్యవసాయ శాఖ మంత్రి అయ్యాక పెన్నా డెల్టాలోనే క్రాప్‌హాలిడేలు ప్రకటించే పరిస్థితి వచ్చిందన్నారు. వైసీపీ మూడేళ్ల పాలనలో సాధించిందేమైనా ఉందా అంటే..పోలీసు స్టేషన్లలో కేసుల సంఖ్యను పెంచడం, ధరలు పెంచడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అక్రమాలు, అరాచకాలు, కక్షసాధింపులు, అక్రమ కేసులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని దుయ్యబట్టారు.

# గిరిజనుల కష్టాలు తీర్చండి

**బిజెపి నాయకుల డిమాండ్**




జిల్లాలోని యానాదులు ఎంతోకాలంగా గృహవసతికి నోచుకోక గుడిసెలలోనే జీవిస్తున్నారని, వారి బాధలు వర్ణనాతీతమని, వారి సంక్షేమాన్ని, అభ్యున్నతిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బిజెపి నేతలు గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు, బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విమర్శించారు. గిరిజనుల దుస్థితిని పట్టించుకుని ఇకనైనా వారికి న్యాయం చేయాలని బిజెపి ఆధ్వర్యంలో ఇటీవల వారు కలెక్టరేట్ ఎదుట ధర్నాందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 సంవత్సరం నుండి 2019 సంవత్సరం వరకు గృహ నిర్మాణ శాఖ వారు యానాదులకు కట్టిన ఇళ్లల్లో నేటికీ ఇంటికి తలుపులు కానీ, కిటికీలు కానీ లేవని, కొన్ని ఇళ్ళకు పూత పని చేయకుండా వదిలేశారని, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా బాధ్యతారాహిత్యంగా ఉండడం దారుణమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాలలో బేస్మెంట్లు వదిలేయడం వలన యానాదులు వాటిపై గుడిసెలు నిర్మించుకొని జీవిస్తున్నారని, కొన్ని గిరిజన కాలనీలు గుంటలలో ఉండడం వలన వర్షాలకు ఆ ఇళ్లలోకి నీళ్ళు ప్రవహిస్తున్నాయని చెప్పారు. అనేక గిరిజన కాలనీలలో నేటికీ త్రాగునీటి సమస్య వెంటాడుతూనే ఉందన్నారు. కొన్ని గిరిజన కాలనీలలో సిసి రోడ్లు నిర్మించక పోవడంతో వర్షాలకు బురదలో ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనులకు ఐటీడీఏ మరియు ఎన్‌ఎస్‌టి ఎఫ్‌డిసి ద్వారా ఇస్తున్న రుణాలు గత మూడు సంవత్సరాలుగా ఆర్థిక సహాయం అందజేయకపోవడంతో గిరిజనుల అవస్థలు తీరడం లేదన్నారు. గిరిజనులు కులాంతర వివాహాలు చేసుకుంటే వారికి అందించే ఆర్థిక సాయాన్ని కూడా రద్దు చేయడం విచారకరమన్నారు. ఈ ధర్నాలో బిజెపి నాయకులు ప్రసాద్, బి.శ్రీనివాసులు, కాసా శ్రీనివాసులు, రామిశెట్టి మోహన్‌బాబు కసుపర్తి నాగేంద్ర, జయచంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# త్యాగానికి ప్రతీక..బక్రీద్

బక్రీద్ పవిత్ర పర్వదినం సందర్భంగా ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా ముస్లిమ్ సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోనూ అన్ని మసీదులు, ప్రార్థనా మందిరాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సామూహిక ప్రార్థనలు చేశారు. నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద జరిగిన కార్యక్రమంలో మతపెద్ద అబూబకర్ అష్రఫి సాబిరి బక్రీద్ విశిష్టతను తెలియజెప్పారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని, ప్రేమ-దయ, కరుణ, సహనం వంటి సద్గుణాల సమ్మేళనమే బక్రీద్ అని తెలిపారు. ఇస్లాం మానవాళికి శాంతిని బోధిస్తుందని వివరించారు. బక్రీద్ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# 'వాత్సల్య'కు దాతల సాయం



నెల్లూరు కొండాయపాళెంరోడ్డులో ఉన్న వాత్సల్య-జనహిత ఆశ్రమంలోని చిన్నారులకు 'మానవసేవే మాధవసేవ' సంస్థ సభ్యులు ఈనెల 10న ప్రోత్సాహక బహుమతులు అందించారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు సింగరాజు కృష్ణ మోహన్ పంపిన 30వేల రూపాయల చెక్కును ఈ సందర్భంగా వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావుకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు చేజర్ల సుధాకర్‌రావు అందజేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దివ్యలక్ష్మి తన తొలి జీతాన్ని ఆశ్రమంలో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. దాత ఉద్దండి కోటేష్ ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సామగ్రిని, దుప్పట్లను అందజేశారు. ఆడిటర్ గుప్తా, పరిమళ, విశ్వనాధం, కోటి సాయిశంకర్, మౌనిక, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 'తెలుగు భారతి' సమావేశం

ఆత్మకూరులోని 'తెలుగు భారతి' సేవాసమితి కార్యవర్గ సమావేశం ఈనెల 10న జరిగింది. అధ్యక్షుడు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గతంలో మాదిరిగా 'మంచిమాట' కార్యక్రమం కొనసాగించాలని, పదవతరగతిలో ఉత్తమ మార్కులతో రాణించిన విద్యార్థులకు దాత సోమవరపు యానాదిరెడ్డి సహకారంతో ప్రోత్సాహక బహుమతులు అందించాలని, తెలుగు భాషాభిమానులను సమితిలోకి ఆహ్వానించి తెలుగుభాషాభివృద్ధికి కృషిచేయాలని నిర్ణయించారు. సమితి గౌరవాధ్యక్షుడు ఎన్‌వి రమణయ్య, ప్రతినిధులు ఎన్‌వి చలమయ్య, యానాదిరెడ్డి, సుబ్బరాయుడు, కెవి శేషారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, శ్రీనివాసరాజు, సుబ్బయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీంద్ర కుమార్, ఓ. శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు రాకుండా చూడండి

**అధికారులకు డిపిఓ ఆదేశం**

జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు ఈ విషయమై దృష్టిపెట్టి ఎలాంటి వ్యాధులు రాకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈనెల 11న ఆమె మండల పంచాయతీ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 30వ తేది దాకా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించకుండా ఆ పనులను పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో చెత్త కుప్పలు, పిచ్చిమొక్కలు, కంపచెట్లు, పేడదిబ్బలను తొలగించాలని, మురుగు కాలువల్లో పూడిక తీయించి మురుగునీరు నిల్వ ఉండకుండా ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## టూకీగా...



### ప్రాంగణ ఎంపికల్లో.. 50 మందికి ఉద్యోగాలు

నెల్లూరు, విఆర్ విద్యాసంస్థల్లో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 50 మందికి ఉద్యోగాలు వచ్చాయి. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'గ్రీన్‌టెక్' సంస్థ వారు ఈ ఎంపికలు నిర్వహించి మెరికలుగా ఉన్న విద్యార్థులను ఎంపికచేసుకుని వారికి ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చారు. ఏపిఎస్‌ఎస్‌డిసి డిఇఎస్‌డిఓ అబ్దుల్‌ఖయ్యూమ్, ప్లేస్‌మెంట్ అధికారి జనార్దన్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీ మేనేజర్, సెక్టోరల్ సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ తనూజారెడ్డి పాల్గొన్నారు.

### సిద్ధనకొండూరు వలంటీర్ దుర్మరణం

కలిగిరిలో పనులు ముగించుకుని మోటార్‌బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మధ్యలో ట్రాక్టర్ ఢీకొని సిద్ధనకొండూరు వలంటీర్ జి.విక్రమ్ (26) తలకు బాగా దెబ్బతగలడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ట్రాక్టర్ అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. విక్రమ్ మృతితో ఆయన భార్యాబిడ్డల గోడు వర్ణనాతీతం!

### రోడ్డుప్రమాదంలో.. హెడ్‌కానిస్టేబుల్ కన్నుమూత

రోడ్డు ప్రమాదం ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను పొట్టనబెట్టుకుంది. నెల్లూరులోని మైపాడుగేటు వద్ద నివాసం ఉంటూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వింజమూరు భాస్కర్ (52) ఇటీవల చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 10న మరణించాడు. దీంతో ఆయన భార్య, ముగ్గురుపిల్లలు తీరని శోకంలో మునిగిపోయారు.

### మెడలో దండ లాక్కుపోయాడు

నెల్లూరులో గొలుసుదొంగలు మళ్ళీ పేట్రేగిపోతున్నారు. చంద్రమౌళినగర్‌లో నివాసం ఉంటున్న విదూష ఇటీవల స్కూటీలో స్థానిక పొదలకూరురోడ్డు వైపు వెళ్తుంటే, బైక్‌లో వెంబడిస్తూ వచ్చిన ఓ అగంతకుడు హఠాత్తుగా ఆమె మెడలోని నాలుగు సవర్ల సరుదును తెంపుకుని వెళ్ళాడు. హఠాత్తు రాలైన ఆ బాధితురాలు తేరుకుని లబోదిబోమంటూ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు ఆ దుండగుడి కోసం గాలిస్తున్నారు.

### 'రోటరీ సౌత్' వారిచే పేపర్‌బ్యాగ్‌లు పంపిణీ

నెల్లూరు రోటరీక్లబ్-సౌత్ ప్రతినిధులు స్థానిక ఆర్‌ఎస్‌ఆర్‌ఎం స్కూల్‌లో విద్యార్థులకు ఈనెల 12న పేపర్‌బ్యాగ్‌లను పంపిణీ చేశారు. రోటరీ సౌత్ సెక్రటరీ శ్రీహరి, సుభద్రాదేవి, పార్థసారథిరెడ్డి, నరసింహారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజలు వాటి వాడకం మానుకోవాలని, పేపర్ బ్యాగ్‌లు లేదా, గుడ్డ సంచులు, జనపనార సంచులు వాడుకోవాలని వారు సూచించారు.

### ఈనెల 17న మహిళా క్రికెట్ జట్ల ఎంపిక

అండర్-16, 19, 23 మహిళా క్రికెట్ జట్లను నెల్లూరులోని ఏసిసుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 17న ఎంపిక చేస్తామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ఆధార్ జెరాక్స్, బర్త్ సర్టిఫికెట్, వైట్ డ్రెస్‌కోడ్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 92977 71777, లేదా 95151 01262 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

### చిన్న కుటుంబాలే మేలు

అధిక సంతానం వద్దని, ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో కూడిన చిన్న కుటుంబమే మేలని, అందరూ కుటుంబనియంత్రణ పాటించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కుటుంబ నియంత్రణకు సంబంధించి ఆయన ఈనెల 11న నెల్లూరు కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్-జనం-జపం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ నుండి తాను తప్పుకుంటున్నానని రాజశేఖరరెడ్డి సతీమణి, జగన్ మాతృమూర్తి విజయమ్మ చేసిన ప్రకటన పార్టీ వర్గాల్లో కొంత అసంతృప్తిని మిగిల్చినా, పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్ ఎంపిక వారికి సంతృప్తిని కలిగించింది. ఇక వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా జగన్ మోహన్‌రెడ్డి సొంతం. ఇక్కడ కుటుంబ పాలనకు స్థానం లేదు, కుటుంబసభ్యులకు పార్టీలో అవకాశం లేదన్న స్పష్టమైన సందేశం ఇచ్చినట్లయింది. ఇక్కడ జగనే హీరో. ఆయనే సుప్రీం, ఆయనే సర్వం, సకలం అన్నది స్పష్టమైపోయింది. ఈ పార్టీ జగన్ దత్తపుత్రిక, ఈ ప్రభుత్వం ఆయన కష్టార్జితం, ఇక్కడ లాభం, నష్టం, కష్టం, సుఖం ఏమున్నా మొత్తం బాధ్యత అంతా ఆయనదే అని ఈ ప్లీనరీలో సూటిగా సుత్తి లేకుండా చెప్పినట్లయ్యింది.

### 'కష్టం నాది... త్యాగం మీది' - జగన్

'కష్టం నాది, త్యాగం మీది' అంటూ జగన్ చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రతిపక్ష పార్టీలని , 'దుష్ట చతుష్టయాన్ని', 'ఎల్లో మీడియా'ని విమర్శించిన తీరు పక్కనపెడితే, తనను ఆదరించి అక్కున చేర్చుకుని 151 సీట్లు ఇచ్చిన జనంపై జగన్ కురిపించిన ప్రశంసలు, చూపించిన



కృతజ్ఞతాభావం ఈ ప్లీనరీలో హైలైట్‌గా చెప్పొచ్చు. తొలిరోజు సభలో 'నన్ను మీ వాడిగా, మీ కుటుంబంలో ఒకడిగా చేర్చుకుని ఆశీర్వదిస్తున్న మీకందరికీ పేరు పేరునా సెల్యూట్ చేస్తున్నా' అని జగన్ అన్న మాటలకు సభాప్రాంగణం కరతాళ ధ్వనులతో మారుమోగింది. ఇక రెండవ రోజు 'మీరే నా సైన్యం' అంటూ మొదలుపెట్టి తాను ఇప్పటివరకు చేసిన వాగ్దానాలు, వాటిలో 95 శాతం తీర్చడానికి తాను చేసిన కృషి వివరించిన తీరు అశేష సంఖ్యలో హాజరైన జనాన్ని ఆకర్షించింది.

### జగన్ - జగన్ - జగన్...!

'జనం కోసం జగన్ ఎత్తిన జెండా వై.యస్.ఆర్.'... అన్న పాటకు అక్షర సాక్ష్యంగా పార్టీ ప్లీనరీ జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమాలలో 'జగన్' ప్రధాన ఆకర్షణ. ప్రస్తుత మంత్రులు, పీకేసిన మంత్రులు అందరూ జగన్ స్తోత్రమే చదివారు. తాము గెలిచినా, మంత్రులుగా నిలిచినా అంతా అన్న పుణ్యమే అనే కఠోర నిజాలు ఒప్పేసుకున్నారు. తామంతా ఉత్త డమ్మీలమే అని చెప్పకనే చెప్పారు. వచ్చే ఎన్నికలలో అన్న తమకు టిక్కెట్టిస్తే పోటీ చేస్తాం, లేదంటే ఆయన ఎవరిని నిలబెట్టినా గెలిపిస్తాం అని శపథం చేశారు. కొంతమంది మాజీలు తాము మంత్రులుగా పనిచేశామన్న సంగతి కూడా మర్చిపోయి తమ నిజస్వరూపం బయట పెట్టి మైకు ముందు వీరంగం వేశారు. విజయమ్మతో సహా వేదికపైన మహిళలున్నారన్న సంగతి కూడా మర్చిపోయి సహజ రీతిలో బూతులతో తిట్ల వర్షం కురిపించారు.

### అంచనాకు మించి జనం

పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత జరిగిన మొదటి ప్లీనరీ కావడంతో జనం ఊహించినదానికంటే అధిక సంఖ్యలో ఈ రెండు రోజుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా రెండవ రోజు ముందు రోజుకంటే రెట్టింపు శాతం ప్రజలు హాజరై 'జై జగన్.. జై జై జగన్' అన్న నినాదాలతో సభా ప్రాంగణాన్ని మారుమ్రోగించారు. ఇప్పటికే అమలులో ఉన్న నవరత్నాలకు తోడుగా మరో 9 పథకాలు ప్రకటిస్తారేమో అని వచ్చిన వారికి మాత్రం నిరాశేమిగిలింది. ఈ నవరత్నాలు కూడా ఈసారి గెలిస్తే ఉండవేమో అని భయంగా వచ్చినవాళ్ళకి ధైర్యం వచ్చింది.

మొత్తంమీద ఈ రెండురోజుల ప్లీనరీ జగన్-జనం-జపంతో, వైసీపీ పెద్దలు ఆశించిన రీతిలోనే జరిగాయి. ఇక, ఎన్నికలకు సన్నద్ధం కావడమే మిగిలి ఉంది.

## నా ఉనికి ఎవరికీ వివాదాస్పదం కాకుండా, అభ్యంతరకరం కాకుండా ఉండాలని

# ఈ పార్టీ నుండి తప్పుకుంటున్నా

-వై.యస్.విజయమ్మ



వై.యస్.ఆర్. కాంగ్రెస్ ఆవిర్భావం నుండి ఆ పార్టీ గౌరవాధ్యక్షురాలిగా కొనసాగిన వై.యస్. విజయమ్మ 8వ తేదీ జరిగిన ప్లీనరీ సమావేశంలో ఆ పార్టీ నుండి తాను వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. తన కొడుకు కష్టాలలో ఉన్నప్పుడు తాను ఆయనకి అండగా ఉన్నానని అన్నారు. ఇప్పుడు తన కూతురు తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాటం సాగిస్తున్నప్పుడు, సంతోషంగా ఉన్న తన కొడుకు వైపు తాను నిలబడడం భావ్యం కాదని అన్నారు. అందుకు తన మనస్సాక్షి ఒప్పుకోవడం లేదని చెప్పారు. రాజశేఖరరెడ్డి భార్యగా, షర్మిలకు తల్లిగా ఆమెకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. తన ఇద్దరు బిడ్డలు తనకు రెండు కళ్ళలాంటి వారని చెప్పారు.

తన ఉనికి వివాదాస్పదం కాకూడదని, అభ్యంతరకరం కూడా కాకూడదని తాను తన పదవికి రాజీనామా చేసి పార్టీ నుండి తప్పుకుంటున్నట్లుగా తన కొడుకు జగన్ సాక్షిగా లక్షలమంది పార్టీశ్రేణుల సమక్షంలో ప్రకటించి పార్టీ నుండి వైదొలిగారు.

అయితే... ఆమె కేవలం పార్టీ గౌరవాధ్యక్ష పదవికే రాజీనామా చేస్తుందని భావిస్తున్న తరుణంలో పార్టీ సభ్యురాలిగా కూడా కొనసాగకుండా బయటకు వెళ్లిపోవడం బాధాకరమని కొందరు వ్యాఖ్యానించడం గమనార్హం.

### ఇదే చివరి మాట కాదు...

విజయమ్మ ఇప్పుడు తీసుకున్న నిర్ణయమే శాశ్వతం కాదని కొందరు పార్టీ శ్రేణుల వాదన. పార్టీ పుట్టకముందు నుండి ఆమె తన కొడుకుకి అన్ని వేళలా తోడుగా, నీడగా ఉన్నారని, మళ్ళీ తన బిడ్డకు అవసరమైన రోజున విజయమ్మ ఖచ్చితంగా రాష్ట్రానికి వచ్చి తమ నాయకుడు జగన్‌మోహనరెడ్డికి అండగా నిలుస్తారన్న ఆశాభావాన్ని వైసీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

# గోడ బయటకు.. గొటబాయ

(మొదటి పేజీ తరువాయి)

దండెత్తారు. నేతల అసమర్థపాలనతో తమ జీవితాలు నరకం కంటే ఘోరం కాగా చివరికి ఆ ఘోరకలిని భరాయించలేక ప్రజలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. పెల్లుబికిన ప్రజాగ్రహం ముందు నిలవలేక నేతలు పరారయ్యారు. అయితే శ్రీలంక అధ్యక్షుడు గొటబయ రాజపక్స ఈ ప్రమాదం ముందే ఊహించి అధ్యక్ష భవనం నుంచి సైగ్గా ముందురోజు రాత్రే చాపచుట్టేశాడు. 'దేశమంతా కొలంబోకు' అనే నినాదంతో శ్రీలంకలో వెల్లువెత్తిన జనాగ్రహం దెబ్బకు దేశాధ్యక్షుడు బెంబేలెత్తిపోయి బ్రతుకుజీవుడా అనుకుంటూ గోడదూకేసి పలాయనం చిత్తగించాడు. ఇంతటి వైపరీత్యం..ఇలాంటి దుస్థితి.. దేనికి సంకేతం?.. అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, వాస్తవానికి ఇలాంటి ఘటనలు మంచివికాదు. ప్రజాస్వామ్యవాదు లెవరూ వాటిని సమర్థించలేరు. అందుకే శ్రీలంక ఘటనలు ఎక్కడా పునరావృతం కాకూడదని అందరూ అభిప్రాయపడుతున్నారు.

### వెల్లువెత్తిన జనం..
### పెల్లుబికిన ఆగ్రహం :

నేల ఈనిందా.. అన్నట్లుగా ఒక్కసారిగా లక్షలాదిగా జనం దేశం నలుమూలల నుంచి మహోగ్రంగా కదలిరావడంతో లంక గజగజ వణికిపోయింది. శ్రీలంక అధ్యక్షభవనం పరిసరాలన్నీ జనంతో నిండిపోయాయి. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ సంగతి ముందే ఊహించిన గొటబాయ ముందురోజు రాత్రే రహస్యంగా అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. పటిష్టమైన భద్రత ఉన్న శ్రీలంక అధ్యక్ష భవనాన్ని ప్రజలు చుట్టుముట్టడంతో భద్రతా బలగాలు వారిని నిరోధించలేకపోయాయి. ప్రజలు ప్రవాహంలా బారికేడ్లు తోసుకుని వచ్చారు. భాష్పవాయు గోళాలు, జల ఫిరంగులు, గాల్లోకి కాల్పులు చేస్తున్నా లెక్కచేయకుండా అధ్యక్ష భవనం ముట్టడికి జనం తోసుకువచ్చారంటే వారిలో ఆ నేతల తీరుపై ఎంత ఆక్రోశం, ఆగ్రహం ఉన్నాయో ఇట్టే అర్థమైపోతుంది. సైన్యాన్ని, పోలీసులను సైతం ఖాతరు చేయకుండా కొంతమంది నిరసనకారులు అధ్యక్ష భవనం గోడలు పగులగొట్టి, మరికొంతమంది గోడలు దూకి లోపలకి దూసుకుపోయారు. కొందరు అధ్యక్షుని నివాసంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈదులాడారు. ఇంకొందరు అధ్యక్షుని మంచంపై పడుకున్నారు. సోఫాలు కుర్చీలపై కూర్చుని సెల్ఫీలు దిగారు. జిమ్‌లో వ్యాయామాలు చేశారు. వంటింట్లోకి వెళ్ళి భోజనం ఆరగించారు. అలా ప్రతి గదిని ఆక్రమించుకుని వీరంగం చేశారు. మరికొంతమంది ప్రజలు అదే ఆగ్రహంతో అధ్యక్షుడు నియమించిన ప్రధాని రణిల్ విక్రమసింఘె సొంత ఇంటిని తగులబెట్టేశారు. వాహనాలను ధ్వంసం చేసిపారేశారు. అధ్యక్షుడు, ప్రధాని ఇద్దరూ రాజీనామాలు చేయాలని ప్రజలు పట్టుబట్టారు. శ్రీలంకలో రాజకీయ సంక్షోభం పరాకాష్టకు చేరుకుందనడానికి ఇదొక నిదర్శనం.

### అసమర్థపాలన..
### ప్రజలకు నరకయాతన :

భౌగోళికంగా, చారిత్రికంగా భారత్‌కు అతిదగ్గరగా ఉండే శ్రీలంక.. రాజపక్సేల ఏలుబడిలో భారత్‌ను త్రోసిరాజని చైనాకు దగ్గరకు కావడం, ఇదే సందని చైనా శ్రీలంకలో భారీగా పెట్టుబడులు పెట్టడం, తిరిగి చైనాకు ఆ చెల్లింపులు చేయలేకపోవడంతో పరిస్థితి విషమించింది. చైనా పెట్టుబడులు అధికశాతం రాజపక్సేల చేతుల్లో పక్కదారిమళ్ళాయనే విమర్శలు కొల్లలు. చైనాతో పాటు మొత్తంగా విదేశాల వద్ద తీసుకున్న 760 కోట్ల డాలర్ల రుణాలను చెల్లించలేక శ్రీలంక చేతులెత్తేసింది. చివరికి ఆహారానికి కొరత ఏర్పడింది. ఇంధనం, వంట గ్యాస్ వంటి అత్యవసరాలను కూడా కొనుగోలు చేసేందుకు శ్రీలంక వద్ద డబ్బులేక దివాలా తీసిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తేటతెల్ల



## మాల్దీవులకు చెక్కేసిన గొటబాయ

దేశప్రజల నుంచి పెల్లుబికిన ఆగ్రహాన్ని చూసిన అధ్యక్షుడు చివరికి తాను రాజీనామాకు సిద్ధమని ప్రకటించాడు. కానీ అరెస్టు చేస్తారేమోననే భయంతో రాజీనామా చేయకుండా భార్యతో సహ ఈనెల 13న సైనిక విమానంలో దేశం విడిచి మాల్దీవులకు చెక్కేశాడు. తాత్కాలిక అధ్యక్షుడుగా ప్రధాని విక్రమ రణసింఘేని నియమిస్తున్నామని అక్కడి నుంచే తెలిపారు. దీంతో ప్రజలు మళ్ళీ ఆగ్రహోదగ్రులయ్యారు. మాల్దీవుల ప్రజలు కూడా గొటబాయ తమ దేశం నుంచి వెళ్ళిపోవాలంటూ పెద్దఎత్తున డిమాండ్ చేస్తుండడం గమనార్హం. దీంతో ఆయన సింగపూర్‌కు వెళ్లిపోతారనే వదంతులు వ్యాపించాయి. రణిసింఘే ఇక ఏమీ చేయలేక దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో శ్రీలంకకు తదుపరి అధ్యక్షుడు, ప్రతిపక్షనాయకుడు సజిత్ ప్రేమదాస అధికారపగ్గాలు చేపట్టవచ్చనే ఊహాగానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

## నేతల అరాచకాలతో దేశం నాశనం

ఒకరేమో దేశానికి అధ్యక్షుడు. మరొకరు ప్రధాని. ఇంకో ఇద్దరు మంత్రులు. అంతా సోదరులే. దీంతో లంకంతా రాజపక్సేల గుప్పిట్లోకి వచ్చింది. దాదాపు రెండు దశాబ్దాలుగా వారి నిరంకుశతత్వం రాజ్యమేలింది. వారి అసమర్థపాలనతో దేశమంతా అవినీతి, బంధుప్రీతి, దురహంకారం పెచ్చరిల్లిపోయాయి. అంతా రాజపక్సేల ఇష్టారాజ్యంగా తయారై, దేశం సర్వనాశనమైంది. క్రమేణా శ్రీలంక వైభవమంతా మసిగొట్టుకుపోయింది. సుమారు 2.2 కోట్ల జనాభా ఉన్న ఎంతో సుందరమైన ద్వీపదేశం శ్రీలంక ఇప్పుడు అల్లకల్లోలంగా మారింది. దేశంలో ఇప్పటికే రైతులు చితికిపోయారు. పరిశ్రమలు మూతపడ్డాయి. నిరుద్యోగం కోరలు సాచింది. ఆసుపత్రుల్లో వైద్యం కొరవడి మూతపడ్డాయి. దేశంలో మూడువంతుల ప్రజలు అర్థాకలితో నకనకలాడే దయనీయ పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తు అగమ్యగోచరమైంది. నేతల అనాలోచిత నిర్ణయాలతో దేశం ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయి అక్కడి ప్రజలు ఆకలితో అలమటించిపోతున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా, ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చు. వీటన్నిటికీ రాజపక్స కుటుంబం అవినీతి, అసమర్థ పాలనే నిదర్శనమని ప్రజలు గ్రహించి తిరగబడ్డారు. దాని ఫలితమే..ఇదంతా!..

మవుతుంది. దేశమంతటా రాజకీయ అరాచకాలు, అవినీతి అక్రమాలు పెచ్చరిల్లిపోయాయి. ఆహారధాన్యాల ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. ధరలు భారీగా పెరగడంతో ప్రజలు ఏదీ కొనలేని దయనీయ స్థితి వచ్చేసింది. నేతల అవినీతి, అసమర్థ పాలన, నియంతృత్వ పోకడలే శ్రీలంక సంక్షోభానికి దారితీశాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితులను చక్కదిద్దలేని నేతలు వెంటనే దిగిపోవాలంటూ ప్రజలు ధర్మాగ్రహం ప్రకటించారు. దీంతో ఆ నేతలు పలాయనం చిత్తగించారు.

ప్రజల బాధలు పట్టించుకోకుండా కేవలం వ్యక్తిగత స్వార్థంతో, దురహంకారంతో, నియంతృత్వంతో నాయకులు పాలన చేస్తే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని శ్రీలంక ఘటన రుజువు చేసింది. ప్రజలను లక్ష్యపెట్టకుండా తమకిక తిరుగేలేదని భావిస్తూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే జరిగే పరిణామాలు ఇలాగే ఉంటాయన్నది దీని సారాంశం. ప్రజల ఆకాంక్షలు తెలుసుకుంటూ, వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నిస్వార్థంగా.. అవినీతి రహితంగా.. నిజాయితీగా అందరికీ మార్గదర్శకంగా ఉన్నప్పుడే ఆ నాయకులు పదికాలాల పాటు ప్రజల మనసుల్లో నిలిచే ఉంటారు. లేకుంటే మరో గొటబాయగా చరిత్రహీనులవుతారు.

### కష్టాల సుడిలో శ్రీలంక ప్రజలు

ఇప్పటికే నేతల పాపాలతో దీర్ఘకాలంగా శ్రీలంక ప్రజలు కష్టాల సుడిగుండంలో పడి తీరని ఆవేదనతో..ఆక్రోశంతో ఉన్నారు. చివరికి తినడానికి తిండి కూడా లేక, పిల్లాపాపలతో సహా లక్షలాదిమంది ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆ కష్టాల నుంచి.. ఆ కన్నీళ్ళ నుంచి ముందు శ్రీలంక బయటపడాలి. శ్రీలంకను ఈ ఆపత్కాలంలో ఆదుకునేందుకు ఇప్పటికే మనదేశం అన్నివిధాలా సాయం అందిస్తుండడం ఎంతో సంతోషకరం. అదే విధంగా, శ్రీలంక ప్రజలను ఈ సంక్షోభాల నుంచి గట్టెక్కించడానికి భారత్‌తో పాటు ప్రపంచంలోని అగ్రదేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు అన్నీ ఒక్కటై.. మానవతా హృదయంతో స్పందించి తగు సాయం అందించాల్సి ఉంది.

## కేంద్ర రాష్ట్రప్రభుత్వాలవి..
# ప్రజావ్యతిరేక విధానాలు
### సిపిఎం ధ్వజం



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలను కష్టాల పాలుచేస్తున్నాయని సిపిఎం జిల్లా నాయకులు ధ్వజమెత్తారు. ఈనెల 11న నెల్లూరులో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి నాయకులు ప్రభుత్వాల తీరును దుయ్యబట్టారు. అటు బిజెపి, ఇటు వైసిపి ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలు పెంచడంతో ప్రజల బాధలు వర్ణనాతీతమన్నారు. ధరలను వెంటనే నియంత్రించాలంటూ నినాదాలు చేశారు. ఇంటిపన్ను, చెత్తపన్ను వంటివాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. తొలుత నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి ఆర్టీసి బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం నాయకులు మూలం రమేష్, చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, మోహన్‌రావు, అజయ్‌కుమార్, కృష్ణయ్య, నాగేశ్వరరావుతో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం బకాయిలు ఇవ్వకుంటే.. ఆత్మహత్యలే!
### టిడిపి నాయకుడు మాలేపాటి

కావలి నియోజకవర్గంలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను చెల్లించకుంటే ఇక ఆత్మహత్యలే శరణ్యమని, అధికారులు ఇప్పటికైనా రైతుల బాధలు గుర్తించి వెంటనే బకాయిలు చెల్లించాలని కావలి నియోజకవర్గం టిడిపి నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. ఈనెల 11న టిడిపి ఆధ్వర్యంలో రైతులతో కలసి కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ప్రదర్శన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి అయిదునెలలు కావస్తున్నా ఇప్పటికీ నగదు చెల్లించకపోవడం దారుణమన్నారు. దీంతో రైతుల జీవనపరిస్థితులు దయనీయంగా మారాయన్నారు. ఆమేరకు ఆర్డీఓ శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పేదాకా కదిలేదని ఆర్డీఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ సమాచారం తెలిసి పౌరసరఫరాల డిఎం పద్మ వచ్చి 15 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

# ఆత్మకూరులో అంగన్‌వాడీల ఆందోళన

ఎంతోకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను తీర్చాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున ఆత్మకూరులోని సిడిపిఓ కార్యాలయం వద్ద ఈనెల 12న ఆందోళన చేపట్టారు. తమ వేతనాలు పెంచుతామంటూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని, తెలంగాణ కన్నా వెయ్యిరూపాయలు అదనంగా వేతనాలిస్తామని హామీ ఇచ్చినా నేటికీ అది అమలులోకి రాలేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకుడు జి.శివప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం నాయకురాళ్ళు రాధమ్మ, నాగమణి తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు.

# సమాజాన్ని చైతన్యవంతం చేసేదే కవిత్వం
### - ప్రముఖ కవి కోటేశ్వరరావు

సమాజాన్ని చైతన్యవంతం చేసేదే కవిత్వమని, కవులు ఆ దిశలో కవిత్వంలో రాణించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు ప్రొఫెసర్, ప్రముఖ కవి కోయి కోటేశ్వరరావు అన్నారు. ఈనెల 10న నెల్లూరు ఆసుపత్రి సమావేశమందిరంలో జరిగిన డా.రాధేయ కవితాపురస్కారం సభలో ఆయన ఆధునిక సాహిత్యం, వచనకవిత్వం తీరుతెన్నులను వివరించారు. డా.రాధేయ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా కవులు పెళ్ళూరు సునీల్, సుంకర్ గోపాల్, దొర్నాదుల సిద్ధార్థలు 2022 సంవత్సరానికి డా. రాధేయ కవితా పురస్కారాలను అన్నం శివకృష్ణ(నెల్లూరు), ఎల్ సాంబమూర్తి (శ్రీకాకుళం), పువ్వాడ వెంకటేష్(బెంగుళూరు)లకు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. నెల్లూరు కవి పెరుగు రామకృష్ణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

# పవన్ (ఎన్నికల) 'సన్నాహక' కసరత్తు!

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, దసరా నుంచి ఆయన ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు సిద్ధమవుతున్నారు. అది పాదయాత్ర కాదు. వాహన యాత్రే. కాన్వాయ్ కూడా సిద్ధం అయింది. అయితే, రోజువారీ ప్రయాణించే దూరం, కాన్వాయ్ ఆగే ప్రదేశాలు మొదలైన వివరాలతో కూడిన షెడ్యూల్ ఇంకా సిద్ధమయినట్టు లేదు. అంటే.. మొదటి రోజు ఫలానా ఊరి (ప్రాంతం) నుంచి ఫలానా వరకు... ఇన్ని కిలోమీటర్లు.. భోజన విరామం ఫలానా చోట... సాయంత్రం ఫలాన చోట ప్రజలతో మాట్లాడతారు... రాత్రికి ఫలానా చోట విశ్రాంతి... సాంస్కృతిక కార్యక్రమాలు... మరుసటి రోజు ఉదయమే ఫలాన వారి గృహంలో అల్పాహారం... జనసైనికులతో ఇష్టాగోష్టి... ఇన్ని గంటలకు యాత్ర ప్రారంభం.. ఫలానా... ఫలానా... ప్రాంతాల మీదుగా ఈరోజు యాత్ర ఇన్ని కిలోమీటర్లు... ఇలా, అన్ని వివరాలతో కూడిన షెడ్యూల్ ఇంకా తయారైనట్టు లేదు. నిజానికి ఈ లాజిస్టిక్స్ విభాగానిది పేద్ద పని.

దసరాకు ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున, షెడ్యూల్ రూపకల్పనకు కూడా తగినంత సమయం ఉంది. అయితే, అప్పటివరకు ఏ కార్యక్రమమూ లేకుండా ఎకాయెకిని యాత్ర అంటే, అక్షరాభ్యాసం రోజునే ఆవకాయ పెట్టినట్టుగా ఉంటుందేమో అని జనసేన వ్యూహకర్తలు (ఒకవేళ ఉంటే గనుక) భావించి ఉంటారు. దసరా నుంచి ప్రారంభమయ్యే 'టెస్ట్ మ్యాచ్'లకు ముందు 'నెట్ ప్రాక్టీస్, వార్మ్‌అప్ మ్యాచ్'లు వంటి సన్నాహక చర్యలు ఉంటే బాగుంటుందని పవన్ కళ్యాణ్ భావించి ఉంటారు.




అందులో భాగమే.. శరీరానికి చమట పట్టని 'జనవాణి' కార్యక్రమం. ఐడియా బాగుంది. పేరు కూడా క్యాచీగా ఉంది. వారాంతపు సెలవు రోజు అయిన ఆదివారం నాడు పవన్ కళ్యాణ్, హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకోకుండా... ప్రజల ఈతి బాధలపై వారి నుంచి వినతి పత్రాలను స్వయంగా స్వీకరించాలని నిర్ణయించడం... ఈ కార్యక్రమం హైలైట్.

కోట్లాదిమంది అభిమానులకు తెర మీద తప్ప, భౌతికంగా ఒక పట్టాన దర్శనం లభించని పవన్ కళ్యాణ్ స్వయంగా బాధితుల నుంచి తన స్వహస్తాలతో వినతి పత్రాలు స్వీకరిస్తారు అంటే... అదేమీ చిన్న, చితక విషయం కాదు.

ఇప్పటికే, విజయవాడలో రెండు ఆదివారాలు అయ్యాయి. మూడవ ఆదివారాన్ని భీమవరంకు కేటాయించారు.

అయితే, అధికారపక్షంలోని ముఖ్యమంత్రి, మంత్రి, ఎం.ఎల్.ఏ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ లేదా అధికార పార్టీ ప్రముఖులు చేపట్టాల్సిన కార్యక్రమం ఇది. ఆయా స్థాయిల్లో అధికార యంత్రాంగం వారి కనుసన్నల్లో మెలుగుతూ ఉంటుంది కనుక, ప్రజల సమస్యలు పరిష్కరించాలి అనుకుంటే వారికి చిటికెలో పని.

కానీ, ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రుల్ని, ఇతర నేతల్ని, వారి చర్యల్ని నిత్యం విమర్శిస్తూ వస్తున్న పవన్ కళ్యాణ్ ఈ జనం సమస్యలను అధికారుల చేత ఎలా పరిష్కరింప చేయగలరు? "నీ సమస్యలు ఏమైనా ఉంటే మాకు చెప్పుకోవాలి గానీ... ఆ పవన్ కళ్యాణ్‌కి చెప్పుకుంటావా..?" అంటూ బాధితుల మీద అధికార అత్యుత్సాహ కార్యకర్తలు కయ్యానికి దిగితే.. వారిని పవన్ కళ్యాణ్ బృందం రక్షించ గలదా?

అంత పేద్ద పవన్ కళ్యాణ్ స్వయంగా వినతి పత్రాలు స్వీకరిస్తారు అంటే... శ్రీకాకుళం నుంచీ, చిత్తూరు వరకూ బాధితులు అనేక వ్యయప్రయాసలకు ఓర్చుకుంటూ రావడం సహజం. కనీసం, తమ అభిమాన తెరవేలుపునైనా దగ్గర నుంచి, పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో చూసి పులకించి పోవచ్చు. సమస్య పరిష్కారమైనా, కాకపోయినా అనుకుంటూ... దొల్లుకుంటూ అయినా వస్తారు.



కానీ, ఆయన వారి నుంచి ఆప్యాయంగా, ప్రేమగా, అభిమానంగా తీసుకునే వినతిపత్రాలను అధికార యంత్రాంగం పట్టించుకోదు. మరి, ఈ జనవాణి వల్ల ఎవరికి ఉపయోగం?

ఒకవేళ, దసరా నుంచి ప్రారంభం కావలసి ఉన్న ఆయన యాత్రకు 'సన్నాహక' కార్యకలాపాలు కావాలి అనుకుంటే.. బాధితులను తన వద్దకు పిలిపించుకోవడం కాకుండా తనే బాధితుల వద్దకు వెళ్లే కార్యక్రమం రూపొందించుకుని ఉండవలసింది. రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు కార్యకర్తలో... అభిమానులో... శ్రేయోభిలాషులో... కావలసిన వారో గట్టిగానే ఉన్నారు. తమ తమ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి పూర్తి అవగాహన ఉంటుంది. వాటి పరిష్కారం కోసం ఏం చేయాలనే విషయమై స్పష్టత కూడా ఉంటుంది.

ఆ వివరాలు సేకరించి, ప్రాధాన్యతా క్రమంలో ఒక్కో ఆదివారం / ఆయనకు వీలైన వారం – అక్కడకు వెళ్లి, ఆ సమస్యపై ధర్నానో, ఊరేగింపో, బాధితులతో సమావేశామో, అధికారులకు స్వయంగా వినతిపత్రం ఇవ్వడమో.., ఏది వీలైతే అది చేస్తే, ఆయనకు మైలేజ్, అధికార యంత్రాంగంలో ఎంతో కొంత స్పందన, ఆయన పట్ల జన సామాన్యంలో సదభిప్రాయం కలగడానికి అవకాశం ఉంటుంది.

ఈ జనవాణి కార్యక్రమం వల్ల, వైసీపీ నేత మాజీమంత్రి పేర్ని నాని పవన్‌ను ఇప్పటికే 'వీకెండ్ పొలిటీషిషన్' అంటూ వ్యాఖ్యానించారు. "జనవాణి"ని పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న తీరుకు ఈ కామెంట్ లక్క అతికినట్టు అతుకుతుంది. మామూలుగానే ఆయనకు పార్ట్‌టైమ్ పొలిటీషియన్ అనే విశేషణాలు తగిలించి మాట్లాడుతుంటారు. ఈ "జనవాణి" కార్యక్రమంతో, 'వీకెండ్ పొలిటిసియన్' అనే విశేషణం కొత్తగా జత కలిసింది.

ఎవరేం వ్యాఖ్యానించినా, విమర్శించినా స్థితప్రజ్ఞుడులా ముందుకు వెళుతున్న పవన్ కళ్యాణ్‌కు తన రాజకీయ ప్రయాణంపై స్పష్టమైన అవగాహన, అంచనా ఉన్నాయి అనడంలో సందేహం లేదు. ఎన్ని అసెంబ్లీ /లోకసభ స్థానాలు సాధించాం అనేది పవన్ కళ్యాణ్‌కు ముఖ్యం కాదు. రాజకీయాలలో ఉన్నామా.. లేదా అనేది ఆయనకు ముఖ్యం.

ఎన్నికలప్పుడు తెలుగు దేశంతో కలిస్తే లాభమా...? విడిగా పోటీ చేస్తే లాభమా? ఏది బాగా వర్క్‌ఔట్ అవుతుంది అనే విషయంలో కూడా ఆయనకు క్లారిటీ ఉంది. అయితే, తుది నిర్ణయం తీసుకునేందుకు ఇంకా సమయం ఆసన్నం కాలేదు. అప్పుడు అసలు సిసలు పవన్ కళ్యాణ్‌ను మనం చూస్తాం. అప్పటిదాకా ఈ 'కాలక్షేప బఠాణీలు' తప్పకపోవచ్చు.

**- భోగాది వేంకట రాయుడు**

# ప్రతి లబ్దిదారునికి సంక్షేమ పథకాలు అందాలి
### - సచివాలయ సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులోఉండి, వారికి మెరుగైన సేవలు అందించడంతో పాటు, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 12న గుడ్లూరు మండలం, చేవూరు గ్రామ సచివాలయాన్ని, సాలిపేట గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ ప్రజలు సంతృప్తి చెందేలా సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ సచివాలయం రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, కందుకూరు ఆర్.డి.ఓ జి.వి.సుబ్బారెడ్డి, తహశీల్దార్ లావణ్య, ఎంపిడిఓ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# జడ్పీ సమావేశం 17న జరుగుతుంది

ఈనెల 12న నిర్వహించాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడడంతో ఆ సమావేశం ఈనెల 17న జరుగుతుందని, ఆరోజు ఉదయం10.30 గంటలకు నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి జడ్పీటిసి సభ్యులు, అధికారులు హాజరు కావాలని జడ్పీ సిఇఓ వాణి ఈనెల 11న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సర్వోదయలో పుస్తకావిష్కరణ

ప్రముఖ జర్నలిస్టుగా, పత్రికా సంపాదకుడుగా పేరొందిన షేక్ అమీర్‌బాషా (బెంగుళూరు) తాను రాసిన సంపాదకీయాలు, వ్యాసాలు, ప్రముఖుల ఇంటర్వ్యూలతో సంకలనం చేసిన 'బియాండ్ స్క్రిబ్లింగ్స్' అనే పుస్తకాన్ని ఈనెల 10న నెల్లూరులోని సర్వోదయ కళాశాలలో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. హైకోర్టు అడ్వొకేట్ డా. అవధానం రఘుకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సర్వోదయ విశ్రాంత ప్రిన్సిపాల్ డా.కాళిదాసు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# 95 కోట్లతో పెన్నానదికి కాంక్రీట్ గోడ

## శంకుస్థాపన చేసిన మంత్రి అంబటి



పెన్నానదికి వరదలు వచ్చినప్పుడల్లా నెల్లూరు నగర శివారుల్లో వరద నీరు ముంచెత్తుతుండడంతో ప్రజలను ఆ అవస్తల నుంచి రక్షించడానికి ప్రభుత్వం 95కోట్ల రూపాయలతో పెన్నానదికి రక్షణ గోడ నిర్మిస్తోంది. ఆ పనులకు ఈ నెల 13న రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రవాహంతో గతంలో భగత్‌సింగ్‌నగర్, వెంకటేశ్వరపురం ప్రాంతాలు నీటమునిగాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని, ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు పెన్నానది వద్ద కాంక్రీట్ రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదిలోగా ఈ నిర్మాణం పూర్తిచేస్తామని అన్నారు. అనంతరం మంత్రి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ చేశారు.

# చిన్నారులకు అక్షరాభ్యాసం



గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 13న పల్లిపాడు దళితవాడలోని ఉన్నత పాఠశాలలో చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు సేవాప్రియ సభ్యులు అక్షరాభ్యాసం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్ష కార్యదర్శులు వికాస్ ప్రసాద్, డా.కృష్ణ మోహన్, కోశాధికారి ప్రవీణ్‌లు పాల్గొని 80మంది చిన్నారులకు పలకలు, స్వీట్లు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు సేవాప్రియ సభ్యులు పిడిజి వై.అమృతవల్లి, జ్యోత్స్న, టి.పద్మరాజ్, జెవి సుధారాణి, పద్మావతి, బి.అను తదితరులు పాల్గొన్నారు.

### అమర్‌నాథ్ నుంచి..

# క్షేమంగా ఇళ్లకు

జిల్లానుంచి అమర్‌నాథ్ యాత్రకు వెళ్ళినవారు తిరిగి క్షేమంగా ఇల్లు చేరుకుంటున్నారు. అక్కడ భారీవర్షాలు, వరదలు వెల్లువెత్తుతుండడంతో అక్కడి నుంచి యాత్రికులను ప్రభుత్వం స్వస్థలాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లా నుంచి ఈ యాత్రకు వెళ్లేందుకు 82 మంది తమపేర్లు రిజిస్టర్ చేయించుకున్నారని, వారిలో ముగ్గురు ప్రయాణం విరమించుకున్నారని, మిగిలిన 79 మందిలో ఈనెల 12వ తేది రాత్రికల్లా 32 మంది వారి ఇళ్ళకు చేరుకోగా, మరో నలుగురు బంధువుల ఇళ్ళకు వెళ్ళిపోయారని కలెక్టరేట్ వర్గాలు పేర్కొన్నాయి. 13వ తేది సాయంత్రానికి మరో 13 మంది సురక్షితంగా నెల్లూరుకు వచ్చారని, ఇంకా మిగిలివున్న వారు కూడా త్వరలోనే ఇళ్లకు చేరుకునేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అమర్‌నాథ్ ప్రాంతంలో వరదల దృష్ట్యా యాత్రికుల క్షేమ సమాచారం కోసం, యాత్రికులకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబరు 1902తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి, నోడల్ అధికారిగా సురేష్‌కుమార్‌ను నియమించారని పేర్కొన్నారు.

# జిల్లాలో స్వల్పంగా.. కంపించిన భూమి

**• బెంబేలెత్తిన ప్రజలు**

ఈనెల 13వ తేది బుధవారం వేకువన 5 గంటల సమయంలో జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంలో పలుచోట్ల భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు బెంబేలెత్తారు. పెద్ద శబ్దంతో భూమి ప్రకంపించడంతో ఆందోళనకు గురయ్యారు. 3 సెకన్ల పాటు భూమి కంపించిందని ప్రజలు తెలిపారు. కొన్నిచోట్ల ఇంట్లో అటకలు, అరమరల్లోని వస్తువులు కిందపడిపోవడంతో ప్రజలు భయపడి వీధుల్లోకి పరుగుతీశారు. ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు, అనంతసాగరం మండలాల్లో పలుచోట్ల హటాత్తుగా ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. బండగానిపల్లి, జి.చెరువుపల్లి, బూదవాడ, కృష్ణాపురం, బ్రాహ్మణపల్లి, సింగనపల్లి, నాగినేనిగుంట, కదిరినాయుడుపల్లి, పడమటి నాయుడిపల్లి, చుంచులూరు, మర్రిపాడు, పెగళ్ళపాడు, ఇర్లపాడు, తిక్కవరం, పల్లవోలు, ఖాదర్‌పూర్, మర్రిపాడు కండ్రిగ, నందిపాడు, పొంగూరు, కేతుగుంట, చిలకలమర్రి, గుడిగుంట తదితర ప్రాంతాల్లో భూప్రకంపనలు ప్రజలను హడలెత్తించాయి.

# రోడ్డెక్కిన పారిశుద్ధ్య కార్మికులు

**• కొనసాగుతున్న సమ్మె**



తమ డిమాండ్లను సాధించుకునేదాకా సమ్మె విరమించేదే లేదని పారిశుద్ధ్య కార్మికులు స్పష్టం చేస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని కావలి, ఆత్మకూరు, కందుకూరు మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఈనెల 11 నుంచి సమ్మెలోకి దిగారు. గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13న నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి విఆర్‌సి సెంటర్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించి ఆందోళన కొనసాగించారు. అనంతరం కెవిఆర్ పెట్రోల్‌బంకు సమీపంలో మహిళా కార్మికులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు మోహన్‌రావు, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, కిన్నెర కుమార్, అల్లాడి గోపాల్, ప్రసాద్, చిట్టిబాబు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో నగర వీధులు మురుగుతో పేరుకుపోతున్నాయి.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com